ఎడారి రేచులు!

శ్యాంబాబు

'పార్మర్' రాజస్థాన్ సరిహద్దులో వున్న చిన్నగ్రామం.

భారత పాకిస్తాన్ సరిహద్దు ఆవూరికి సరిగ్గా యాభై మైళ్ళ దూరం వుంటుంది. ప్రభుత్వం ప్రజలు మరిచిపోయిన అతిచిన్న ప్రదేశం అది. చుట్టూ మైళ్ళకొలది ఎడారి, అంత తెగని ఇసుక కుప్పలు, రాళ్ళు ఇసుక కలిసి గట్టిపడిపోయిన సారం లేని నేల, చిన్న చిన్న చెట్లు మొలవని కొండలు— అవూరుఅక్కడ ఎలా వెలసిందో, ఎందుకో, అవూళ్ళో ఇంకా ప్రజలు ఎందుకుంటున్నారో, నాగరికతా ప్రపంచాన్నిచూసిన మనుషులకు అర్థంకాదు.

శతాబ్దాలనుండి ప్రజలు ఆవూళ్ళో మిగతా ప్రపంచంతో

సంబంధం లేకుండా అలా బ్రతుకుతోనే వున్నారు. వూరి మొత్తానికి ముప్పై ఇళ్ళుకన్నా ఎక్కువవుండవు. అన్నీ రాతితో కట్టిన పురాతనపుఇళ్ళు, కప్పుగా ఖర్జూరపుమానులు, 'సీసా బొంగులు, ఖర్జూరవు ఆకులు వుపయోగిస్తారు. ఊరు మధ్యలో చిన్న మంచినీటిబావి– తియ్యటి, చల్లటి నీరు, బావిచుట్టూ గుంపులుగా పెరిగిన ఖర్జూరపు వృక్షాలు... అదే లేకపోతే ఆ వూరు వుండేదికాదను కొంటాను.

కానీ:1965లో పాకిస్థాన్‌తో యుద్ధంతోబాటు, పార్ మర్ ప్రాముఖ్యత కొద్దిగా పెరిగింది. 'బికనీర్'నుండి 'చరక్ వాలా', మొహన్‌ఫుర్' మీదుగా 'జైసిల్మర్'కు ఓరోడ్డును సైనిక అవసరాలకోసం వేయడం జరిగింది. అలాగే ఈరోడ్డును కలుపుతూ మరోసరిహద్దు పట్టణమైన 'బిర్‌సిల్‌ఫూర్'కు మరో రోడ్డు వేయడం జరిగింది. చిత్రంగా ఈ రెండు రోడ్లు 'పార్‌మర్' దగ్గర కలవడంతో 'పార్‌మర్'కు ప్రాముఖ్యత పెరిగింది.

యుద్ధం తరువాత ఈరోడ్డు సివిలియన్ ట్రాన్స్‌పోర్టుకు కూడా వుపయోగించడంతో 'పార్‌మర్‌లో' సంచలనం ప్రారంభ మయింది. చిన్నటీస్టాలు, భోజన హోటలు వెలిసాయి, ట్రక్ రిపేరుషాపు, ఇతర అవసరాలకు పనికి వచ్చే కొట్లు తెరవ బడ్డాయి. రాత్రనక, పగలనక ఈరోడ్లమీద కొన్నివందల మైళ్ళు ఎడారి ప్రయాణం చేసే ట్రక్ డ్రైవర్లకి, సైనికులకు 'పార్‌మర్' చరికేంద్రం అయింది.

ఆరోజు మధ్యాన్నం పదకొండు గంటలు కావొస్తుంది. వేసవి దాటిపోయినా సూర్యుడు ఇంకా తీవ్రంగా తనప్రతాపాన్ని చూపెడుతోనే వున్నాడు. ఇసుకనేల కావడంతో వేడిని త్వరగా పీల్చు కొంటుందినేల. ఉదయమే బికనీర్‌నుండి, మొహన్‌ఫుర్

నుండి బయల్దేరిన ట్రక్కులు అంతకు ముందేవచ్చి ఆగాయి

మానాన్న ట్రక్ డ్రైవర్లకు టీకలపడానికి, అమ్మచపాతీల చెయ్యడంలోనూ మునిగిపోయారు. స్టాల్‌లో ఒకమూల నలుగుర ఆర్మీ జవాన్లకూర్చొని సిగరెట్లు కాల్చుకొంటూ, ఖర్జూరాల తింటూ కబుర్లు చెప్పుకుంటున్నారు. నేను కాష్‌కౌంటర్ వెను కుర్చీలో కూర్చొని తీరగ్గా వచ్చేపోయే ట్రక్కుల్ని, సైనికవాహ నాల్ని చూస్తూ కూర్చున్నాను.

ఆకాశంలో చిత్రమైన ధ్వని వినిపించింది. దూరంగ పొడుగాటి హెలీకాప్టర్ పోతూ కనిపించింది. 'డిజర్ట్ వార్‌ఫెర్ లో సైనికులకు శిక్షణ ఇవ్వడానికి చరక్‌వాలా దగ్గర నెలకొల్పి ట్రయినింగ్ సెంటర్ తాలూకుది అయ్యుండాలి. క్రిందనుండి చూడ్డానికే చాల పెద్దదిగా కనిపిస్తుంది. వారానికి రెండ మూడు సార్లు ఇటువైపు ఎగురుతూ వస్తుంది. సిగరెట కాల్చాలని పించింది. అమ్మా నాన్న ముందుకాల్చడం అలవాట లేదు నాకు. బయటకి నడిచి, ఖర్జూరచెట్టు నీడిలో నిలబడి సిగరెట్ వెలగించాను.

దూరంగా శ్రీమోహన్‌ఘర్ వైపునుండి ఏదో జీప వస్తుంది. సిగరెట్ పొగవదులూ ఆశ్చర్యంగా దాని వైపు చూస్తూ నిలబడ్డాను. అలాంటి జీపులు ఈవైపువెప్పుడూరావు జీపు తిన్నగా వచ్చి టీస్టాలు ముందు ఆగింది. 'లాండ్‌లోవర్ అనే అక్షరాలు బోనెట్‌మీద మెరుస్తున్నాయి. బ్రిటీష్‌మేడ్ ఫోరువీల్ డ్రైవ్ జీపు. ఇలాంటి ఎడారి ప్రాంతంలో బాగా పని చేస్తుంది. లాండ్‌లోవర్ డోరు తెరచుకొని క్రిందకుదిగి వ్యక్తిని పరిశీలనగా చూస్తూవుండిపోయాను.

ఆరడుగుల భారీ శరీరం, డెనిమ్ జీన్స్, సమ్మర్ స్లాక్ ధరించాడు, కాళ్ళకు బాటావే సైండర్ బూట్లు, కళ్ళకు అత

క్కున్నట్టుగా వుండే 'విండ్‌బీటర్' కూలింగ్‌గ్లాసెస్, చేతికి కంపాస్ డయల్ వాచీ— లాండ్‌లోవర్‌లోనుండిదిగి మా టీస్టాల్‌వైపు పరీక్షగా చూస్తున్నాడతను. పట్నవాసానికి బాగా అలవాటుపడిన మనిషిలా వున్నాడు. నేను సిగరెట్ నలిపేసి అతని దగ్గరకు నడిచాను.

"వాట్ కెనై డూ ఫర్‌యు సర్!"—అన్నాను చిరునవ్వుతో. అతను నావైపు పరిశీలనగా చూశాడు. "ఇక్కడ ఇంగ్లీషు మాట్లాడే వాళ్ళు కూడా వున్నారన్నమాట"—అన్నాడు అదోలా.

"నేను బి.ఎ. చదివాను. ఈ టీస్టాలు మాదే. పరీక్షపాస యినా ఉద్యోగం దొరక్క ప్రస్తుతానికి ఇక్కడే వుంటున్నాను. లోపలికిరండి"— అన్నాను లోపలికిదారితీస్తూ.

"పరీక్షపాసయినా ఎడారిలో ఉద్యోగాలు దొరకవు... ఏ పట్టణంలోనో ట్రై చెయ్యాలి"— అన్నాడతను లోపలికొస్తూ.

అతను స్టాల్ లోపలికి రాగానే ఒక్కక్షణం లోపల నిశ్శబ్దం ఏర్పడింది. అందరూ మాటలు ఆపేసి అతనివైపు చిత్రంగా చూస్తూ వుండి పోయారు. నాన్న స్టౌ దగ్గరనుండి హడావిడిగా ముందుకొచ్చి భుజం మీద మాసిన తుండు గుడ్డతోనే ట్రకుర్చీ దులిపి అతన్ని కూర్చోమన్నాడు. ట్రక్‌వాలాలు మళ్ళీ వాళ్ళ సంభాషణలో పడిపోయారు.

"షర్బత్ తెమ్మంటారా సాబ్!"—నాన్న వినయంగా అడుగుతోన్నాడు.

అతన్నవ్వుతూ తల అడ్డంగా త్రిప్పాడు. "ఇప్పుడేమీ అక్కరలేదు. నేను నాలుగైదు రోజులు ఇక్కడ వుండదలుచు కొన్నాను. వీలవుతుందా?" అన్నాడతను.

నాన్న ఇబ్బందిగా నావైపుచూశాడు. పార్‌వుర్‌లో బయటి వాళ్ళెప్పుడూ ఒక్కరాత్రికన్నా ఆగరు. అలాంటిది ఇతను నాలు

గైదు రోజులు వుండదలుచు కొన్నాడంటే ఇక్కడేదో పనిమీద వచ్చియుండాలి. పార్మర్ లాంటి అతిచిన్న పల్లెటూళ్లో ఇతనికేం పనివుందో ఊహించ లేక పోయాను.

"ఈ వూళ్ళో సాధారణంగా బయటి వాళ్ళెవరూ బస చేయరు సార్! మీరు వుండడానికి హోటల్స్ లాంటివి కూడా లేవు" —అన్నాను లోలోపల ఆశ్చర్యపోతూ!

"నో...నో... నాకు హోటల్స్ ఏమీ అక్కరలేదు నాజీపు చూశావుగా? నిద్రపోదలుచుకుంటే లోపలే పడుకోగలను...నా దగ్గర టెంటుతో సహా కాంపింగ్ఎక్విప్మెంట్ అంతావుంది. నాకు కావలసింది భోజనం, వసతికాదు. ఈప్రాంతమంతా క్షుణ్ణంగా తెలిసిన ఒకమనిషి కావాలి"— అన్నాడతను సిగరెట్ వెలిగిస్తూ.

"నేను చిన్నతనంనుండీ ఇక్కడే పుట్టి పెరిగాను. చదువు కోసం పై వూళ్ళకు వెళ్ళినా, ఈప్రదేశమంతా నాకుబాగా తెలుసు. నేను మీకు సహాయం చెయ్యగలను. కాని మీరు చూడదగిన ప్రదేశం, చూసి ఆనందించదగిన ప్రదేశాలు— ఈప్రాంతంలో లేవు"—అన్నాను అతని ప్రశ్నకు జవాబుగా.

అతను సిగరెట్ పొగసన్నగా ధారలా వదుల్తూ నవ్వాడు... "నేను ఈ చుట్టూ ప్రక్కల ప్రకృతి దృశ్యాలు, పురాతన స్థలాలు చూడ్డానికి రాలేదు. ఈప్రాంతపు ఎడారి కొండల్లో 'ఎడారి రేచులు' దొరుకుతాయని వినివచ్చాను"— అన్నాడు.

"ఎడారిరేచులా?"— అన్నాను ఒక్కక్షణం అర్థంకానట్టు.

ఎడారిరేచులు, తోడేలు జాతికి చెందిన జంతువు. పెద్ద సైజు కుక్కలా వుంటుంది. మెడమీద సింహంలా జూలు పెరిగిఉంటుంది. ముఖం, ముట్టె వెడల్పుగా ఉంటాయి. సన్నని నడుం, పొడవాటి కాళ్ళు వుంటాయి. గంటకు

దాదాపు డెభ్భైయి మైళ్ళ వేగంతో పరుగెత్తగలదు. అతి చురకైన జంతువు. ఈ ఎడారి కొండల్లోనే దొరికే రాతిబల్లులను, తొండలనూ, కొండ గొర్రెలనీ వేటాడి తింటుంది. ఈ జాతికుక్కలు ఈ రాజస్థాన్ ఎడారి ప్రాంతంలోనేఉంటాయి. కాలక్రమేణా ఈ జాతి సహజమరణాల వల్లా, మనుష్యులవల్లా నశించిపోయి అపరూపమైపోయింది. మనుష్యులు ఎక్కువగాతిరగని ఈ ప్రాంతంలోని 'రేచు' లు మాత్రం ఇంకా కొద్దిగా దూరాన కనబడే కొండలో మిగిలి ఉన్నాయి.

"అవును! పూర్తిగా నశించిందని ప్రభుత్వంచేత ప్రకటింపబడిన ఈ రేచు ఇంకా ఈ ప్రాంతంలో బ్రతికిఉందని నాకీమధ్యనే తెలిసింది. నేను హంటర్ని. నైనటాల్లోనూ, గిర్ అడవులలోనూ, చంబల్లోయలోనూ, ఇదివరలో అనేక రకాలైన జంతువుల్ని వేటాడానుకాని, ఇంతవరకూ రేచును మాత్రం నేను వేటాడలేదు. ఈ అరుదైన మృగాన్ని వేటాడి, దానిచర్మంతో డమ్మీ తయారుచేయించి నా డ్రాయింగ్‌రూమ్‌లో పుంచాలనేది నాకు చాలా కాలంగా మిగిలిపోయిన కల"— అన్నాడు అతను.

"కాని ఎడారిరేచును వేటాడ్డం చాలా కష్టం. అది చాలా క్రూరమైన తెలివైన జంతువు. ఏ మాత్రం అవకాశం దొరికినా రంపాల్లాంటి పళ్ళతో ప్రత్యర్థిని చీల్చిచెండాడుతుంది. మెరుపులా కదులుతుంది. గాలిలా పరిగెడుతుంది. ఈ ఎడారి కొండలో దాన్ని వేటాడ్డం చాలా కష్టం"— అన్నాను నేను.

"డోన్ట్ బాదర్! ఈ ఎడారిలో అవి తిరిగే ప్రాంతం నువ్వు నాకు చూపించగలిగితే చాలు"—

"కాని ఒకటి రెండ్రోజుల్లో అదిమనకు కనబడకపోవచ్చు"

—అన్నాను.

"అయినా ఫరవాలేదు. నాకు వారం రోజులు శెలవుంది. ఈ వారంరోజులు నీవు నావెంట వుండి నాకు సహాయంచేస్తే, నీకురోజుకు పాతిక రూపాయలచొప్పున ఇస్తాను"— అన్నాడతను విలాసంగా చివరి దమ్ము పీల్చి సిగరెట్ ఆర్పేస్తూ.

దాదాపు రెండువందల రూపాయలు ప్లస్ ఎడారిరేచును వేటాడే అనుభవం—పనీపాటాలేకుండా తిరిగేనాకు అంతకన్నా మంచి ప్రపోజల్ వుండదు, అనిపించడంలో ఆశ్చర్యంలేదు.

"ఓకె సర్! ఇట్స్ డీల్!"— అన్నాను నవ్వుతూ...

2

అతని పేరు విశ్వనాథ్ బండారి. అహమ్మదాబాద్‌లో ఓ పెద్దనూలుమిల్లుకు యజమాని అతను. వేట అంటే అతనికి చెప్పలేనంత సరదా. ఆ రోజు సాయంత్రం అతని ఆల్బమ్‌లో అతను చంపిన రకరకాల జంతువుల కళేబరాలతో తీయించు కొన్న ఫోటోలు చూసి ఆశ్చర్యపోయాను. నైనెటాల్ ప్రాంతంలో తిరిగే పెద్దపులి, చంబల్ ప్రాంతంలోని చీటా, భల్లూకాలు అతని తుపాకీ గుళ్ళకు లొంగిన కొన్ని మృగాలు.

అతని వించెస్టర్. 358 ఆటోమేటిక్ యాక్షన్ రైఫిల్ చూసి ఆశ్చర్యపోయానునేను. పది గుళ్ళుపట్టే మాగజైన్ ఫోర్ పవర్ టెలిస్కోపుతో అమర్చబడిన రైఫిల్ అది. దానికి వాడే నికెల్ జాకెట్ బుల్లెట్స్‌కు, ఏనుగు తలలోకి గురి చూసికొడితే, తోకదగ్గరనుండి బయటికొచ్చే శక్తి వుంది.

"నీకు రైఫిల్ పేల్చడం వచ్చునా?"— అడిగాడు బండారీ, ఆరోజు ఉదయం మేము బయలుదేరేముందు.

వచ్చునన్నట్లు తలవూపాను. కాలేజీ యన్. సి. సి. లో ఉన్నప్పుడు ఎరల్‌రాబెట్ షూటింగ్ కాంపిటీషన్‌లో

పెల్గొన్నాను''— అన్నాను.

''హండ్రెడ్ యార్డ్సులో నీ గ్రూపింగ్ ఎంత?''—
అడిగాడు బండారీ.

''టు యించస్!''—అన్నాను గర్వంగా.

''ఏ రైఫిల్‌తో?''—

''.303 మార్క్‌ఫోర్...స్టాండర్డ్ ఆర్మీ వెపన్'' —
అన్నాను.

''వెరీగుడ్!''—అన్నాడు బండారీ చిత్రంగాచూస్తూ.

అవును. .303 రైఫిల్‌తో హండ్రెడ్ యార్ట్స ఫైరింగ్‌లో రెండంగుళాల గ్రూపింగ్ వచ్చిందంటే నేను మంచి గుటికాడికిందే లెక్క. ఐదు బుల్లెట్లు వరసగా వంద గజాలదూరంనుండి పేలిస్తే అవి టార్గెట్‌మీద రెండంగుళాల వ్యాసంవున్న వృత్తం లోపల తగిలితే దాన్ని టూ ఇంచి గ్రూపింగ్ అంటారు.

''నీదగ్గర రైఫిల్‌గాని, బోర్‌గన్ గానీ వుందా?'' —
అడిగాడు బండారి.

లేదనట్లు తలవూపాను. బండారీ లాండ్‌లోవర్ డాష్ బోర్డ్ క్రిందవున్న గన్ రేక్‌లో నుండి మరోగన్‌బయటకుతీసి, చిన్న సూట్‌కేస్‌లో నుండి టెలిస్కోప్ లెన్స్ తీసి దానికి బిగించి నాకందించాడు.

నేను దాన్నందుకొని భుజానికి ఆదిమిపెట్టి దూరాన వున్న కొండలకేసి లెన్స్‌లో నుండి చూశాను. దగ్గరిగా వున్నట్లు కనిపిస్తోంది. రైఫిల్ దించి పరీక్షగా చూశాను. .22 హార్నెట్‌రైఫిల్. మాంచెస్టరంత పెద్ద రేంజ్ లేకపోయినా, మూడువందల గజాలవరకూ చాలా యాక్యురేట్‌గా పనిచేస్తుంది. బోల్డ్‌యాక్షన్ రైఫిల్ చాలా తేలిగ్గా

వుంటుంది.

తృప్తిగా తలాడించి బండారీకి ఇచ్చేశాను. ఇద్దరం మా వూరికి పశ్చిమానవున్న కొండలకేసి బయలుదేరాం. ఫోర్‌వీల్ డ్రైవ్ కావడంవలన, వదులుగాఉన్న ఇసకలోకూడా లాండ్ లోవర్ మెత్తగా ముందుకు కదిలింది. రాళ్ళగుట్టలవల్ల, ఇసకవల్ల పెద్దస్పీడుగా పోకపోయినా రెండు గంటల్లో దాదాపు నలభై మైళ్ళు కవర్ చేశాము. అదే కాలినడకనైతే రెండు రోజులు పట్టేది.

ఎటుచూసినా చిన్న చిన్న ఎత్తు పల్లాలతో, ఎక్కడా పచ్చదనం కనిపించని విశాలమైన ఎడారి. ఒంటరిగా, సరైన పరికరాలు, దుస్తులులేకుండా ఆ ఎడారిలో బ్రతకడం బహు దుర్లభం. అక్కడక్కడా దుబ్బులుగా పెరిగిన 'కాక్టస్' జాతి మొక్కలు తప్ప మరేరకమైన వృక్షసంతతి ఆ ప్రాంతంలో కనిపించదు. దూరానవున్న కొండలు క్షణక్షణానికి దగ్గరవుతున్నాయి. నేను లాండ్‌లోవర్‌లో బండారీ ప్రక్కనే ఫ్రంట్‌సీట్లోకూర్చొని ఎటువెళ్ళాలో డైరక్షన్ ఇస్తున్నాను. ఎడారిలో తిరగడం అలవాటులేకపోతే దారి తెలియడం చాలా కష్టం. ఎటుచూసినా ఓలాగానేఉంటుంది. చిన్న చిన్న రాతి గుట్టలను, కొండలను, గుర్తు పెట్టుకొని ప్రయాణంచేయాలి.

ఎడారి రేచులు ఆ ఎదురుగాఉన్న కొండ గుట్టల్లో తిరగడం అప్పుడప్పుడూ చూశాను. ఎప్పుడైనా సంవత్సరానికి నాలుగైదుసార్లు కురిసే వానసీళ్ళు కొండల్లో ప్రకృతి సహజంగా ఏర్పడ్డ రాతిగుంటల్లో నిలవుంటుంటాయి. ఆ నీరు త్రాగడానికి సూర్యోదయ సమయంలో వస్తూవుంటాయి రేచులు. అలాంటి నీటిగుంటలు వుండే కొండప్రాంతానికి వెడుతున్నామిప్పుడు. మేము ఈ రాత్రికి ఆదగ్గరలో కాంప్‌వేసి, పుదయమే

పట్టుకోవడంవేలని సాయంత్రమే బయలు దేరాము.

కొండలదగ్గరికి రాగానే జీపు ఆపి క్రిందకు దిగాము. సున్నగా ఏవరో పనిపెట్టుకొని చదును చేసినట్లువున్నాయి చాలావరకు. మనుషులు తిరగని ప్రాంతంకాబట్టి కొండల పైకి వెళ్ళడానికి దార్లంటూ ఏమీలేవు. నిజానికి అవి కొండలు కావు. పెద్ద పెద్ద రాళ్ళగుట్టలు. కొన్ని ఏకరాళ్ళు, కొన్ని రకరకాల రాళ్ళు ఒకదానిమీదఒకటి పడి ఏర్పడినవి. మా జీప్ఆగిన స్థలానికి ఎడంప్రక్కగా ఒక కొండ మీద కాస్త ఏక్కువగా కాక్టస్ మొక్కలు కనిపిస్తున్నాయి. దానిమీదే 'కాళీమాయీ' గుడి ఒకటివున్నట్లు గుర్తునాకు.

"ఆ కొండమీద ఏక్కువగా కాక్టస్ కనిపించడానికి కారణం ఏమిటి?—" అడిగాడు బండారీ.

"అంటే ఆకొండమీద ఎక్కువగా రాతిపగుళ్ళు ఉన్నాయన్నమాట. ఏప్పుడైనా వర్షం పడినప్పుడు ఆ రాతి పగుళ్ళ మధ్య వున్న ఇసుకలో నీరు నిలవవుండటం జరుగుతుంది. అలా ఏన్ని పగుళ్ళుఉంటే అన్నిచోట్ల దాంట్లో ఇసుకవుంటే నీరు నిలవవుండే అకాశం ఉంది. అలాంటిచోట్ల ఈ కాక్టస్ చెట్లు మొలుస్తాయి. పదండి ఆకొండే ఏక్కుదాము. దానిమీదవున్న కాళీమాయీ గుడిచుట్టు ప్రక్కల రాళ్ళక్రింద నీళ్ళు నిలవుండే గుంటలు చాలా వున్నాయి"— అన్నాను.

ఇద్దరం పావుగంటలో ఆగుట్టఏక్కాము. పైన ఒకదాని మీద ఒకటి పడిపోయినట్లుగావున్న రాళ్ళమధ్యవున్న ప్రదేశంలో ఒకచోట 'కాళీమాయీ' విగ్రహంఉంది. అదే గుడి కాళీమాయీది. ఏప్పుడు ఏవరు ఆ విగ్రహాన్ని అక్కడపెట్టారో తెలియదుకానీ, అదినాకు తెలిసినప్పటినుండీ అలానేఉంది. కాళీమాయీకి భక్తిగా దండంపెట్టుకొన్నాను.

కళ్ళు తెరిచేప్పటికి బండారీ నన్నుచూసి నవ్వుతున్నాడు. "నీలాంటి భక్తులెవరో ఈ మధ్యే కాళీమాయిని దర్శించు కొన్నట్టున్నారు"— అన్నాడు.

అప్పుడుచూశాను నేను కాళీవిగ్రహం నుదుటవున్న కుంకుమ బొట్టు, ఎప్పుడో ఎవరో పెట్టిన పొడికుంకుమ బొట్టు ఇంకా కాళీనొసటన అలానే వుండదు. ఈ రోజో, నిన్ననో పెట్టినట్లు అనిపిస్తోంది.

"ఏమో! మావూరినుండి ఎవరూ ఇక్కడికి వచ్చినట్లు నాకు తెలియదు. వచ్చినామనకు దార్లో ఎదురు పడేవాళ్ళు. బహుశా ఎప్పుడో ఎవరో పెట్టిందయుంటుంది"— అన్నాను.

"కాళీమహత్యం అయుంటుంది"— అన్నాడు బండారీ నవ్వుతూ.

కాళీ గుడికి క్రిందుగా రాళ్ళ క్రింద,బండల సందుల్లో నాలుగు నీటిగుంటలు కనిపించాయి. గుంటల చుట్టూ వున్న ఇసుకలో రేచుల కాలిముద్రలు స్పష్టంగా అవుపిస్తున్నాయి. ఆ ప్రదేశంనుండి ఏడారి ప్రదేశం గుర్తుపెట్టుకోమన్నాడు బండారేనన్ను.

"మనం దగ్గరలోవుండి దాన్ని కాల్చాలని ప్రయత్నిస్తే అది తప్పించుకొని పారిపోవచ్చు, మనల్ని పసిగట్టి. అంచేత ఈ ప్రాంతం ఏడారిలో ఎక్కడకు బాగాకనిపిస్తుందో అక్కడవుండి షూట్ చేస్తే బావుంటుంది"—అన్నాడు బండారీ.

"కానీ అక్కడినుండి రేంజ్ సరిపోతుందా?" అన్నాను అనుమానంగా.

"వించెస్టర్ రేంజ్ దాదాపు 1200 మీటర్లు. టెలిస్కోపిక్ సైట్‌లోంచి సరిగ్గాచూసి షూట్‌చేస్తే గురితప్పే అవకాశం లేదు"— అన్నాడు బండారీ కాన్ఫిడెంట్‌గా.

ఎంతో గురికాడైతేతప్ప ఆ రేంజ్‌నుండి మిస్ అవకుండా కాల్చుతాడు. బండారీ సామర్థ్యం నాకు తెలియదు. అందుచేత వాదన చెయ్యదల్చుకోలేదు.

కాసేపు ప్రాంతాన్ని బాగా ఆకళింపు చేసుకొన్నాక, ఇద్దరం కిందికి దిగివచ్చి టెంట్ వేసుకొని విశ్రాంతి కుపక్రమించాము.

3

తూర్పున తొలి వెలుగు రేఖలు అప్పుడే విచ్చుకొంటున్నాయి. రాత్రి చల్లదనం ఛాయలు ఇంకా పోలేదు. నేను బండారి ఇసుక మధ్యలో అమర్చి పెట్టినట్లు వున్న ఓ రాతి వెనక నిలబడి మా రైఫుల్స్‌కు అమర్చిన టెలిస్కోపిక్ లెన్స్‌లో నుండి 'కాళీమాయీ' గుడివున్న ప్రాంతాలకేసి చూస్తున్నాం. లెన్స్‌లోనుండి చూడ్డం విసుగుపుట్టినప్పుడు బండారీ మెడలో తగిలించుకొన్న బైనాక్యులర్స్‌తో చుట్టూ చూస్తున్నాడు.

"చందన్! లుక్ అవి వస్తున్నట్లున్నాయి"— అన్నాడు బండారీ ఉన్నట్లుండి గుసగుసలుగా. నేను రైఫిల్ భుజానికి ఆనించి కాళిమాయీ గుడికేసి లెన్స్‌లోనుండి చూశాను. యస్ హియీజ్ రైట్! రెండు రేచులు ఎటునుండో వచ్చి అటూ ఇటూ చూస్తున్నాయి. ఆకోణంలోనుండి అది దాదాపు ఓ కిలోమీటరు దూరంలో వుండివుంటాయి. అంటే అది మమ్మల్ని వాసనతో పసిగట్టగల దూరంలో వున్నామన్నమాట. అందులోనూ గాలికూడా సన్నగా మామీదుగా అటువైపు వీస్తోంది.

లెన్స్‌లో అవి రెండూ కదలడం స్పష్టంగా కనిపిస్తున్నాయి. అందులో ఓ రేచు లేచి రెండుకాళ్ళు బండమీదపెట్టి మేమున్న వైపుకు చూస్తోంది

"అవును! అవే!" అన్నాను నేను వాటిమీదనుండి దృష్టి త్రిప్పకుండా.

బండారీ నిశ్శబ్దంగా రైఫిల్ భుజానికి ఎత్తిపెట్టి, చేంబర్లోకి బుల్లెట్ లోడ్‌చేసి బోల్ట్ మూశాడు. నేను రేచులవంక చూస్తున్నాను. అది మావైపు చూస్తున్నదల్లా చటుక్కున బండదిగి రాళ్ళచాటున మాయమయింది.

"కనబడగానే షూట్ చెయ్యకండి! అవి నీటిగుంటదగ్గర నీరు త్రాగటానికి ఉపక్రమించేవరకూ ఆగండి"— అన్నాను అటువైపే పరీక్షగా చూస్తూ.

"ష్యూర్! ష్యూర్!"— అన్నాడు అసహనంగా.

మరో రెండు నిముషాల తర్వాత మాకు ఇందాక కనిపించిన చోటుకు ఓ యాభై గజాల అవతలగా మరోబండ క్రింద కనిపించాయి. అవిరెండూ మోరలెత్తి చుట్టూచూసి క్రింద దేన్నోవాసనచూస్తున్నట్లు వంగాయి. ఆరాత్రిక్రిందేనిన్న సాయంత్రం ఓ నీటిగుంట చూశాను. అంటే అవి నీళ్ళు త్రాగుతున్నాయన్నమాట.

నేను రైఫిల్‌దించి బండారీవైపు చూశాను. అతని ముఖంవైపుచూసి ఉలిక్కిపడ్డాను. బండారీ ముఖంలో నరాలన్నీ బిగుసుకొని వున్నాయి. ఒక కన్నుమూసి మరోకంటితో టెలిస్కోపిక్ లెన్స్‌లోనుండి చూస్తున్న అతని ముఖాన్ని చూస్తుంటే నా మనస్సులో ఎందుకో తెలియని భయం కలిగింది.

మళ్ళీ రైఫిల్‌ఎత్తి రేచులకేసి చూశాను. ప్రశాంతంగా తమపని చేసుకుపోతున్నాయి. మరణం మరోక్షణంలో తమపై దూసుకువస్తున్నట్లూ వాటికి తెలియదు. నేను ఊపిరి బిగబట్టి అటే చూస్తున్నాను. ఉన్నట్లుండి అవి చటుక్కున గెంతి ఓ బండపైకి వెళ్ళాయి.

"డామిట్!"—అన్నాడు బండారీ కసిగా.

రేచులు బండలపైనుండి దూరంగా పరిగెత్తాయి. నేను

లెన్స్‌లోనుండి వాటినే వెంబడిస్తున్నాను. బండలమీదనుండి మెరుపుల్లా గెంతుతూ, వాటి చాటుకు పరిగెడుతూ అవి క్షణాలమీద మాయమయి పోయాయి.

"హియ రీజ్ ఎనెదర్‌వన్! మరోటి" అన్నాడు బండారీ ఎక్సైయిట్‌మెంట్‌తో.

"ఎక్కడ?"— అన్నాను అతనివేపు చూసి.

అతని ముఖంమీద క్రూరమైన నవ్వు? కనబడుతోంది. "షటప్! ఇందాకటి చోటునే!"—

నేను రైఫుల్ ఎత్తి లెన్స్‌లోనుండి అటుకేసి చూశాను. బండలచాటునుండి ఏదో ఆకారం కదుల్తోంది, స్పష్టంగా తెలియడంలేదు. ఆకారం బండల చాటునుండి కదలి లెన్స్ వ్యూలోకి వచ్చింది. ఉలిక్కిపడ్డాను నేను.

"స్టాపిట్! స్టాపిట్ మిష్టర్ బండారి!"— అరిచాను అతనివైపు తిరిగి.

అప్పటికేఆలస్యమైపోయింది. 'ధన్' మనీ పేలిన రైఫిల్ గుండు ఎడారి రాళ్ళలో ప్రతిధ్వనించింది. బండారీ ముఖంలో కనిపించే క్రూరమైన నవ్వుకు నాగుండెలు వణికాయి. చటుక్కున రైఫిల్‌ఎత్తి ఆ ఆకారం వున్నకేసి చూశాను. ఏమీ కనిపించలేదు.

"మైగాడ్! బండారీ! యుకిల్డ్‌హిమ్! నువ్వతన్ని చంపావు" అరిచాను కోపంతో.

బండారీ విసుగుగా నావైపు తిరిగాడు. అతనికళ్ళు అగ్నిగోళాల్లా అనిపించాయి. ఆచూపు నేనిప్పటికి మరచిపోలేను. అది హంతకుడి చూపు.

"నో! చందన్! ఐ మస్ట్‌హిమ్!"— అన్నాడు ఒక్కొక్క మాటే వత్తిపలుకుతూ.

లేదు! బండారీ గురి తప్పలేదని నామనసు ఘోషిస్తోంది. బండారీ కావాలనే అతన్ని చంపాడు.

4

సన్నగా గీసుకొన్న గుండు, నొసట ఎర్రని కుంకుమ బొట్టు, ఎండకు మాడిన నల్లటి ఒంటిరంగు, సగం తెరచీ తెరవనట్లున్న కనురెప్పలు, చప్పిడిముక్కు, గుండెప్రాంతంలో అరంగుళంమేర రంధ్రంలోనుండి మడుగులా కారి క్రింద రాతిమీద రక్తం అప్పుడే గడ్డకడుతోంది. ఆ ఎడారి మధ్యలో ఎక్కడినుండి వచ్చాయో, పెద్ద పెద్ద ఈగలు ఆ గుండెల మీద గాయంచుట్టూ చేరాయి. మొలచుట్టూ కాషాయవస్త్రం మాత్రం చుట్టివుంది. అతనిలో ప్రాణం లేదని చూడగానే తెలుస్తోంది.

ఎవరతను? అక్కడికెలా వచ్చాడు? ఆ ప్రశ్నలకు సమాధానం తెలియడం చాలా కష్టం. హఠాత్తుగా కాళీమాయీ నుదుట కుంకుమబొట్టు గుర్తొచ్చింది. బహుశా కాళీమాయీ భక్తుడయివుంటాడు. మనుష్య ప్రపంచనికి దూరంగా, ఈ ఎడారిలో, కొండగుట్టపై ఒంటరిగావున్న ఈ మనిషి తనను మృత్యువింత హఠాత్తుగా కబళిస్తుందని ఊహించివుండడు.

"ఇటీజ్ యాన్ యాక్సిడెంట్!"—అన్నాడు బండారీ అతనివైపు పరీక్షగా చూస్తూ.

కాని అది యాక్సిడెంట్ కాదని, బండారీ అతను అక్కడ వున్నాడని తెలిసీ, స్పష్టంగా గుర్తించే రైఫిల్ పేల్చాడని నాకు తెలుసు. బహుశా అతని అలికిడి వినే లేడులు త్రాగడం మానేసి పరిగెత్తివుండాలి. ఆ క్షణంలో బండారీ ముఖంలో కనిపించిన క్రోధం, భావాలు నేనింకా మరచిపోలేదు.

''ఆ విషయం నిర్ణయించాల్సింది పోలీసులు! నా లెన్స్‌లో అతడు చాలా స్పష్టంగా కనబడుతోన్నాడు. మనిద్దరం ఒకే రకమైన పెరిస్కోపిక్ లెన్స్‌లోనుండి చూస్తున్నామని మరచిపోకు''— అన్నాను కోపంగా.

జరిగిన విషయం తలుచుకొంటూంటే రక్తం ఉడుకుతోందినాకు. అమూల్యమైన ఓ వేటగుర్తును ఆ సన్యాసి చెడగొట్టాడనే తాత్కాలికక్రోధంలో బండారీ రైఫిల్ పేల్చాడు. సన్యాసి పూర్తిగా మాకు కనబడింతర్వాతే బండారీ రైఫిల్ పేల్చాడనే విషయం నాకుబాగా గుర్తు! ఇది ప్రమాదవశాత్తు జరిగిన సంఘటన కాదు! బండారీ అజాగ్రత్తవల్ల సంభవించిన మరణం. ఓ రకంగా ఇది హత్య బండారీ హంతకుడు!

''ఒ. కె. మిస్టర్ బండారీ! లెటజ్ గో!''— అన్నాను వెనక్కి తిరుగుతూ.

''చందన్!'' బండారీ పిలుపులో విచిత్రమైన కఠినత్వం కనిపిస్తోంది. వెనక్కి తిరిగి ఆతని మొపు చూశాను.

''ఈ మనిషిని ఏం చేద్దాం?''—

''ఆ మనిషిని ఎవరూ ఏం చెయ్యరు. ఎక్కడఉన్నా వాణ్ణి అక్కడ వదిలివేయడం మంచిది. పోలీసులు వచ్చేవరకూ ఆ శవం అక్కడే వుంటుంది.''— అన్నాను అతని కళ్ళలోకి సవాలుగా చూస్తూ.

బండారీ చలించకుండా నా చూపును త్రిప్పికొట్టాడు. 'పోలీసులకు ఈ విషయం రిపోర్టుచేయడం మంచిదంటావా?''

''ఏమో! నాకు తెలియదు! నాకు తెలిసిందల్లా హత్య జరిగినప్పుడు పోలీసులకు వెంటనే తెలియజేయాలని''—అన్నాను.

''ఇది హత్య కాదని నీకు తెలుసు. ఇది యాక్సిడెంట్ అని

నీకు తెలుసు. ఆరేచుకుక్క వెనుకాల అతను వున్నట్టు నేను గమనించలేదు. షాట్ ఫైర్ చేసినప్పుడు రేచు తప్పించుకొంది, ఆ గుండు ఇతనికి తగిలింది. ఇటీజ్ ఓన్లీ వాన్ యాక్సిడెంట్!" బండారీ గొంతు చాలా మృదువుగా వుంది.

బంఢారీ గొప్ప అబద్దాలకోరు అని ఆ క్షణంలో అర్థమయింది నాకు. మాకు కనిపించింది రెండు రేచులే. మూడవ రేచు అనేది బండారీ కల్పితం. దగ్గరలో మనిషి వస్తుండగా ఏ రేచూ నిలబడదు.

"ఆల్‌రైట్! యాక్సిడెంట్లను గుడా అవి జరిగిన వెంటవే పోలీసులకు తెలియజేయాలి"— అన్నాను.

"అవును! ఆ విషయం నాకు తెలుసు. ఇది యాక్సిడెంట్ అని వాళ్ళు నిర్ధారణ చెయ్యాలి. అది చెయ్యడానికి కొంత టైం పడుతుంది. ఎంక్వైరీ ఆఫీసరు సరైన వాడు కాకపోతే అనవసరమైన చిక్కులు. నేను నా లాయర్ని పిలిపించుకొని, డిఫెన్స్ ఏర్పాట్లు చేసికొని అనవసరమైన కష్టాలు పడాలి. అంతా అయితే చివరి ఫలితం ఏమిటి? అతనికి నాకు ఏ రకమైన సంబంధం లేదు కనుక సరైన డిఫెన్స్ లాయరు ఎవరైన ఇది యాక్సిడెంట్ అని ప్రూవ్ చెయ్యగలడు.

కాబట్టి ఎందుకీ అనవసర శ్రమ. ఇతన్ని ఇక్కడే ఎక్కడో పాతిపెట్టి, ఈ సంఘటన గురించి మరచిపోదాం. నువ్వు నాకీ సహాయం ఊరికేచెయ్యొద్దు. నీకు తప్పకుండా బొంబేలోనో, అహమదాబాద్‌లోనో నాకు తెలిసి అమెరికన్ ఫరమ్స్‌లో ఉద్యోగం ఇప్పిస్తాను. ఆలోచించుకో— అన్నాడు బండారీ నా కళ్ళలోకి చూస్తూ.

"ఉద్యోగం చూసితీరాలనే పట్టింపేమీ లేదు నాకు. చిన్న చిన్న విషయాలకు కక్కుర్తిపడి మర్డర్‌కు 'అకాంప్లిస్' అవుతా

నను కోకు''— అన్నాను దృఢంగా.

బండారీ చిన్నగా నవ్వాడు. "పోనీ ఉద్యోగం అక్కర్లేక పోతే నీకేంకావాలో చెప్పు! డబ్బుకావాలా? పదివేలు ఇస్తాను. మీ నాన్న బిజినెస్‌ను డెవలప్ చెయ్యి''—

అప్పుడర్థమయింది నాకు. బండారీ నిజంగానే ఆ మనిషిని చూసే రైఫిల్ పేల్చాడని. వివరంగా నాకు అర్థంకాకపోయినా, ఈ విషయంలోకి పోలీసులు వస్తే తనకు తప్పకుండా శిక్ష పడే అవకాశం వుందని. అందుకనే బండారీ నాకు పదివేలు ఆశ చూపుతున్నాడు. పదివేలంటే తక్కువ మొత్తంకాదు.

నేనూ నవ్వాను. "సారీ బండారీ! డబ్బుతో నన్ను కొనలేవు. ఈ విషయం కప్పిపుచ్చడానికి నీవు పదివేలు ఇవ్వడానికి సిద్ధపడుతున్నావంటే. నువ్వు కావాలనే అతణ్ణి చంపినట్లు అర్థమవుతుంది''—

"నో! యు ఆర్ రాంగ్ చందన్! అతన్ని చంపడం వలన నాకు ప్రయోజనం ఏమిటి? నేనెందుకు ఓ మనిషిని అనవసరంగా చంపుతాను? ఆలోచించు!''

"ఇందులో ఆలోచించడానికి ఏమీలేదు. నీ వేటకు అడ్డొచ్చాడనే తాత్కాలిక ఉద్రేకంలో నువ్వతన్ని చంపేశావు. నిజాన్ని ఒప్పుకొంటె నీకు పెద్దగా శిక్ష పడదు''—

"అయితే పోలీసుల దగ్గరకు వెళ్ళక తప్పదంటావా?''—

"తప్పదు!'' - అన్నాను పరిహాసంగా నవ్వుతూ.

"మంరోసారి ఆలోచించుకో!''—

"ఆలోచించుకొనేందుకేమీ లేదు ఇందులో! నేను వెళుతున్నాను. పోలీసులు వచ్చేంత వరకూ నీవిక్కడే వుంటావంటే నాకు అభ్యంతరం లేదు,,—అన్నాను వెనక్కి తిరిగి కొండదిగడానికి సిద్ధపడుతూ.

రైఫిల్ బోల్టు తెరిచి తిరిగి మూసిన శబ్దం వినిపించింది. గిర్రున వెనక్కి తిరిగాను. బండారీ రైఫిల్ నా గుండెలవైపు గురి పెట్టి వుంది. మా మధ్యన వున్న మూడు గజాల దూరంలో గురి తప్పే అవకాశంలేదు.

“సారీ చందన్! ఈ పరిస్థితుల్లో పెర్మర్ తిరిగివెళ్ళేది నేనొక్కన్నే!”-- అతని చూపులో లేడిని చంపబోయే బోయ వాడు కనిపిస్తున్నాడు.

5

సూర్యుడు అతివేగంగా ఆకాశంలోకి ఎగబ్రాకుతున్నాడు. ఇంకా ఎనిమిది గంటలైనా కాకముందే కాళ్ళక్రింద కొండ వేడెక్కుతోంది. చెమట వల్ల వేసుకొన్న దుస్తులు ఒంటికి అతుక్కుపోతున్నాయి. దూరంగా ఆకాశంలో బండారీ నిలబడిన వైపు ఓరాబందు చిన్నగా ఎగురుతుంది. నేను బండారీ కళ్ళ ల్లోకి చూస్తూ నిలబడిపోయాను.

“నన్ను కూడా చంపి తప్పించుకోలేవు!“— అన్నాను.

ఎందుకో చీకటిగా కనిపిస్తోన్న ఆరైఫిల్ బారెల్ వైపు చూస్తోంటేవెన్నులో నుండి వణుకుపుడుతోంది.

“చూద్దాం! ఈ ఎడారిలో నీకు దిక్కెవ్వరోచూద్దాం!”— అన్నాడు బండారీ పరిహాసంగా.

మనసులోనే శ్రద్ధగా కాళీమాయిని తలుచుకొన్నాను. “బండారీ! ఇప్పటికైనా నా మాట విను. మర్యాదగా టౌన్‌కు వచ్చి నువ్వీ విషయాన్ని గురించి పోలీసులకు రిపోర్టుచెయ్యడం మంచిది. దాని వల్ల నిన్ను నువ్వు కోర్టులో డిఫెండ్ చేసుకోవ డానికి మంచి అవకాశం వుంది.”— అన్నాను.

“సారీ చందన్! పోలీసులు ఈ విషయంలోకి వచ్చే ప్రసక్తి లేదు. ఆ పూజారిగాడితో పాటే నీవు ఈ ఎడారిలో

అంతం అయిపోతావు''— అన్నాడు బండారీ క్రూరంగానవ్వుతూ.

''నీతోపాటు నేను తిరిగి రాకపోతే మావాళ్ళు నా గురించి తెలుసు కుంటారు. మా శవాలు బయటపడినప్పుడు నీకు ఉరి తప్పదు''— అన్నాను.

బండారీ మళ్ళీ నవ్వాడు. ''నేనంత తెలివి తక్కువ వాణ్ణనుకోకు చందన్! నా చేతుల్తో నేను చంపకుండానే నిన్ను మృత్యుముఖానికి పంపే మార్గం నాకు తెలుసు''—

ఎందుకో తెలియకుండానే నా ఒళ్ళు జలదరించింది. నేను అతని చేతిలో రైఫిల్ వైపు మంత్రించబడిన మనిషికి మల్లే చూస్తువుండి పోయాను. ఆ రైఫిల్ అతని చేతుల్లో లేకుంటే ఈ సరికి ఈ ప్రాంతంనుండి పారిపోయేవాణ్ణి.

''నీ షర్టు పాంటు, బూట్లు తీసేయ్!''— అతని కళ్ళు చిత్రమైన ఆనందంతో నవ్వుతున్నాయి.

''వాట్ ది హెల్ యు మీన్...'' అర్చాను కోపంగా.

''షటప్! చెప్పినట్లు చెయ్యి!''—

''నో. నో!''— అన్నాను అరుస్తున్నట్లు.

''ఆల్‌రైట్! ఎందుకో చెపుతావిను. నువ్వు నా రైఫిల్ గుండుకు చావకుండా తప్పించుకోనేందుకు నీకో చాన్సు ఇద్దామనుకొంటున్నాను. నీ ఒంటి మీద దుస్తులు, కాళ్ళకు బూట్స్, తల మీద కేప్ అన్ని తీసేసుకొని నిన్ను పార్‌మర్ వెళ్ళి పోనిస్తాను. చాతనైతే వెళ్ళు!''—

''మై గాడ్! నువ్వు మనిషివి కాదు,మృగానివి!''— అర్చాను కోపంతో.

ఒంటి మీద నూలు పోగులేకండా, కాళ్ళకు ఇసుక వేడికి రక్షణ లేకుండా మధ్య దారిలో ఎక్కడా మంచి నీటి చుక్క లేకుండా, ఆ ఇసుక ఎడారిలో నలభై మైళ్ళు నడిచి 'పార్‌మర్'

కు వెళ్ళడం అసంభవం. మధ్య మార్గంలోనే ఎండదెబ్బకు, అల సటతో, దాహంతో నేను చావక తప్పదు.

"యస్ !చందన్! నువ్వేమీ ఆలోచిస్తున్నావో నాకు తెలుసు. ఎండ వేడికి, దాహానికి తట్టుకోలేక నీవు మధ్యలోనే మరణిస్తావు. మంచినీళ్ళుంటే ఎడారిలో బ్రతకడం తెలిసిన నీవు పార్మర్ చేరకోగలవేమో... కాని నీళ్ళులేకుండా నీవు పది మైళ్ళ కన్న ఎక్కువ వెళ్ళలేవు. ఆ తర్వాత నీ శవాన్ని ఏ రాతి గుట్టల మధ్యనో పడేసి, నువ్వు ఎడారిలో రేచులను వెతుకుతూ వెళ్ళి తిరిగి రాలేదని, వెనక్కు తిరిగి వెళ్ళి చెపుతాను"—

"యు ఆరె ఫూల్!" ఆ పూజారి శవాన్నేంచేస్తావు. ఎండకు మాడిన నాఒంటిని గురించి, బొబ్బలెక్కిన నా కాళ్ళను చూసి ఏదో జరిగిందనే అనుమానం జనానికి కలగకమానదు. నేను రేచుళ్ని వెతకడానికి వెళ్ళినా గుడ్డలూడ దీసుకొని వెళ్ళా ల్సిన అవుసరం లేదని, దీంట్లో ఏదో మర్మం వుందని అర్థ మవుతుంది...చిన్నచిన్న నేరాలు తప్పించుకోవడానికి పెద్దనేరాలు చేసి జీవితానికి ముప్పుతెచ్చుకోనేవాడిని విన్నే చూశాను. నా మాట విని ఇప్పటికైనా వెనక్కి తిరిగి వెళదాం పద"— అన్నాను ఒక అడుగు ముందుకు వేసి.

"ధన్" మని రైఫిల్ పేలింది. గుండు నా చెవిని రాచు కొంటూపోయింది. బాధగా చెవిని పట్టుకొన్నాను.

"డోన్ట్ ట్రై దట్ ఎగెయిన్! కదిలావంటే నిన్ను చంపడానికి వెనుకాడను"— అన్నాడు బండారీ మెఱుపులా రైఫిల్ రీలోడ్ చేసి నావైపుకు గురిపెడుతూ.

"యు డామ్ ఫూల్! నీకు మతిపోయింది"— అర్చాను బాధగా.

కాని బండారీ మూర్ఖుడు కాదు. అతనికి మతిపోలేదు.

నా వైపు క్రూరంగా చూస్తు నిలబడ్డాడు.

"చందన్! నీవనుకొన్నంత బుద్ధిహీనుణ్ణి కాదు నేను. నిన్నేంచేయాలో ముందే నిశ్చయించుకొన్నాను. ఆ పూజారిగాడి శవాన్ని ఎక్కడో ఎవరికీ తెలియనిచోట పాతేస్తాను. తర్వాత నీ దుస్తులు బూట్లు పీలికలు చేసి నీ శవం చుట్టు ప్రక్కల పారేస్తాను. 'హెల్యూసి నేషన్' గురించి నీకు తెలిసేయుంటుంది. ఎడారిలో వేడికి తట్టుకోలేక దాహంతో పరితపించే వ్యక్తులకు హెల్యూసి నేషన్ వస్తుంది. ప్రతి ఇసుక తెరా మంచినీటి సరస్సులా కనిపిస్తుంది. ఏదిక్కు చూసినా మంచి నీళ్ళు కనిపిస్తాయి. ఆ ఎండమావులు చూసి పరిగెత్తి నీళ్ళు లేవని నిరాశచెంది పిచ్చెక్కి పోతాడు మనిషి. మతిచెలిస్తూ ఆ స్థితిలో ఆ ఇసుకనే నీళ్ళనుకొని తాగడానికి ప్రయత్నిస్తాడు. లేదు! నీవీ ఎండకు వేడికి, దాహనికి తట్టుకోని మా వూరికి చేరినా. నెల రోజుల వరకూ ఏమీ మాట్లాడే స్థితిలో వుండవు నీవు. ఆ తర్వాత మాట్లాడినా నిన్నెవరూ నమ్మరు. సో నవ్ టేకాఫ్ యు వర్ డ్రస్!"— అన్నాడు బండారీ విజయానంతంగా.

"భగవాన్"— అనుకొన్నాను మనసులోనే. బండారీ నిజంగా పిచ్చివాడు. తనకు పదేకొద్దిపాటి శిక్షను తప్పించుకోవడానికి ఎదుటిమనిషిని అతి క్రూరంగా చంపే మనిషి పిచ్చివాడు కాక మరేమవుతాడు.?

"యు ఆర్ మెడ్"— అరిచాను కోపంతో.

బండారీ పిచ్చాళ్ళ నవ్వాడు. "టే కాఫ్ యువర్ డ్రస్!"

అప్పుడుస్ఫురించింది నాకు ఈ పిచ్చివాడి చేతుల్లోంచి ఏదో ఒకరకంగా బయటపడ్డంతప్ప ఎదురు తిరిగి ప్రాణాలు పోగొట్టుకోవడం అవివేకం అని. ఎడారిలో అదృష్టం బావుంటే

ఏదైనా నీటి గుంట కనిపించవచ్చు. నా శక్తి సరిపోతే మళ్ళీ మా పూరు చేరుకోగలను. కాని వాడి చేతులో ఆ రైఫిల్ వున్నంతకాలం, ఏక్షణాన చంపుతాడో ఊహించలేక నరకయాతన పడాలి. బండారీ నా కిచ్చిన రైఫిల్ కూడా ఆ పూజారిని పరీక్షించినప్పుడు బండారీ ప్రక్కనే వున్న రాతికి ఆనించి పెట్టాను. లాభంలేదు. వీడితో వాదనచేసి లాభంలేదు.

"ఆల్ రైట్! అన్నాను భుజాలెగరేసి.

కాళ్ళకున్న బూట్సులు, మేజోళ్ళు ఉడదీశాను. తరవాత షర్టు, పాంటు, తీసి వాటి ప్రక్కనే పెట్టాను. నా వంటి మీాద బనియను, డ్రాయర్ తప్ప మరేమీాలేవు.

"ఆ బనియన్ కూడా తీసేయ్!"– అన్నాడు బండారీ. అతని చూపులో ఏదో వెర్రి ఆనందం కనిపిస్తోంది.

మాట్లాడకుండా బనియను తీసేశాను. ఎండ వేడి చర్రున వీపుకు తగిలింది.

"నౌ! యు కెన్ గో!"– అన్నాడు బండారీ.

వెనుకకు తిరిగి నేను వెళ్ళాల్సిన దిక్కువైపు చూశాను. కనుచూపు మేర దూరం ఎత్తుపల్లాలు లేని ఎడారి, ఇసుక కనిపిస్తోన్నయ్. ఆ చివర్న ఎక్కడో మా వూరు వుంది. ఈ ఎండ వేడిలో, దాహంతో నలభై మైళ్ళు ఈ ఇసుకలో నడవాలి. నా ప్రతి అడుగు ఇక్కణ్ణించి చూస్తే బండారీకి కనిపిస్తూనే వుంటుంది.

అప్పుడు తట్టింది నాకు. నేను సజీవంగా ఎడారి దాటగలిగినా బండారీ నన్ను దాటనివ్వడని. నేను ఎడారి దాటగలిగేలా వుంటే నిముషాల్లో నా దగ్గరికి చేరుకోగలడు, లాండ్ రోవర్‌లో. గుండెలోంచి దుఃఖం, భయం ఉప్పెనలా పొంగాయి.

మెల్లిగాకొండ దిగడం ప్రారంభించాను.

ఏ క్షణాన రైఫిల్ గుండు నా వీపులో దిగుతుందో అనే భయం క్షణక్షణానికి నాఒంటిని జలదరింపజేస్తుంది. ఆ ఎడారి లో వీడికి మించిన ఎడారి రేచులు వేరే లేవనిపించింది, ఆ క్షణంలో నాకు.

6

కొండ దిగడం మొదలు పెట్టగానే నా మొదటి ఆలోచన గబగబా ఆ లాండ్ లోవర్ చేరుకోవాలని. కొండ దిగువున తెల్లటి ఇసుకలో నీడలా కనిపిస్తోన్న ఆ జీప్‌ను చూడగానే పరి గెత్తి దాన్లో కూర్చోని స్టార్ట్ చెయ్యాలనిపించింది.

ఆ కొండ గుట్ట సగం దిగింతరవాత గుర్తొచింది నాకు, నేను లాండ్ లోవర్ స్వాధీనం చేసుకొన్నా ప్రయోజనం లేదని. బండారీ దగ్గరున్న వింబోస్టర్ చెల్టయాక్షన్ రైఫిల్, ఆ టెలిస్కోపిక్ లెన్స్ సహాయంతో నిముషాల్లో జీపును కదల కుండా చేయగలడు. అలాగా నేను తప్పించుకొని రైఫిల్ రేంజీ లో నుండి అవతలికి పోయే అవకాశంలేదు.

ఎండ వేడికి అప్పుడే ఒళ్ళంతా చెమట ధారాలు కారు తోంది. ఒంటిలో నీరు వున్నంతవరకూ రక్తప్రసరణ జరగడానికి ఎండరక్షణకు చెమట పనిచేస్తుంది. ఆ తర్వాత శరీరమంతా పేలి బీటలుపడుతుంది. నీరసం వచ్చి ఒక అడుగు కూడా ముందుకువేయలేను. మంచి నీరు లేక పోతే ఈ ఎడారిలో దాహంతో పిచ్చాడిలా పరిగెత్తి ప్రాణాలు విడవాల్సి వస్తుంది. తలుచుకొంటే ఒక క్షణం ఒళ్ళు జలదరించింది నాకు. తల త్రిప్పి వెనక్కు చూశాను.

కొండ ఏటవాలుగా వుండడంవలన, ఆ బండల వెనుక పైన ఎక్కడో వున్న బండారీ కనిపించడంలేదు. కాని ఒక సారి కొండదిగి ఎడారిలో ప్రవేశించిన తరువాత నేను వేసే

ప్రతి అడుగు అతనికి కనిపిస్తుంది. ఎందుకో ఆ క్షణంలో నిశ్చయించుకొన్నను— నేను బండారీని ఓడించి బ్రతికి బయట పడాలంటే ఆ అవకాశం నాకీ కొండ గుట్టలోనే వున్నదని ఎంత ఎడారి జీవితానికి అలవాటు పడినా సాహసంతో నలభై మైళ్ళు బండారీ దృష్టిలోంచి తప్పించుకొంటూ, ఈ వేడిలో పోరాడుతూ మా వూరు చేరడం అసంభవం.

ఈ కొండ గుట్టల్లోనే వుంటే, ఈ రాళ్ళచాటున కొండ చరియలో బండారీ రైఫిల్ గుళ్ళనుండి తప్పించుక బయటపడే అవకాశంవుంది. ఎడారిలో కన్నా ఈ రాళ్ళ మధ్య గుంటల్లో నాకు నీరు దొరికే అవకాశం ఎక్కువ. వీలయితే తిరి వేటినయినా పట్టుకొని ఆహారంగా వుపయోగించవచ్చు.

ఈ కొండ గుట్టలన్నీ దాదాపు నాకు తెలుసు. ఒకప్పుడు నేను తిరిగినవే. దాదాపు మూడుమైళ్ళ పొడవున వున్నాయి ఆ ఎడారి మధ్యలో కొండలకు ఓ చివర అంచులో వున్నావు మేము. రెండవ చివర, దాదాపు రెండుమైళ్ళ అవతల ఇంక పెద్ద గుట్టలున్నాయి. ఆగుట్టలపైకి ఎక్కడానికికూడా చాల కష్టం. ఆ ప్రాంతంలో చాలా నీటిగుంటలు కూడా వున్నాయి అంచేతే ఆ వయిపుకు వెళ్ళాలని నిశ్చయించుకొన్నాను.

సమయం దాదాపు ఉదయం పది కావొస్తున్నది. మరో రెండుమూడు గంటల్లో ఎడారి ఓ అగ్నిగుండంలా తయారవు తుంది. ప్రతిబండా, ప్రతి ఇసుకరేణువు, ప్రతి అంగుళంనే సూర్యుడి ప్రతాపానికి వేడెక్కి నిప్పులు కక్కుతాయి. కాళ్ళక రక్షణ లేకుండా అడుగువేయడం అసంభవం. అప్పుడు గుర్తొ చ్చింది. దూరానవున్న ఆకొండ ఎక్కాలన్నా కాళ్ళకేమీ లేకుండ ఎక్కడం అసంభవం.

అప్పుడు గుర్తొచ్చింది నాకు. పూజారి కాళీమాయీ

ప్రాజిస్తూ ఈ కొండమీద వుంటుంటే ఈ కొండ గుట్ట మీదే ఎక్కడో అతని నివాసం వుంటుంది. కాళీమాయీ విగ్రహానికి దగ్గర్లోనే ఏ రాతిబండలమధ్యనో అతని ఆహారం, బట్టలుకూడా వుండివుంటాయి. ఎండలో ఈ ప్రాంతంలో తిరగడానికి కనీసం చెప్పులయినా వుండివుంటాయి. ఈ విషయం బండారీకి తట్టి వుండదని నాకెందుకో అనిపించింది.

దిగినదారినే పైకెళితే బండారీకి కనిపించక మానను. అసలు ఈసరికి నేనింకా క్రిందికి ఎందుకు దిగలేదా అని ఆశ్చర్య పోతూ వుంటాడు. అంచేత కొండ అవతలి ప్రక్కకు వెళ్ళి అటునుండి పైకి ఎక్కడం మంచిదని నిశ్చయిచుకొన్నాను.

గబగబ నా కుడివైపుకు వెళ్ళడం ప్రారంభించాను. అటు వైపునుండి కొండ వంపుతిరిగి అవతలి వైపుకు వెళ్ళడానికి నిశ్చ యిచుకొన్నాను. కొండ ఏటవాలుతనం ఆవైపు తక్కువుండడం వలన పైనుండి బండారీకి నేను కనిపించే అవకాశంలేదు.

కొండ అవతలివైపుకు చేరేప్పటికి దాదాపు అరగంట పట్టింది. అంతా చిత్రమైన శబ్దం ఆవరించుకొనివుంది. బండారీ ఏంచేస్తున్నాడో అంతుపట్టకుండా వుంది నాకు. చప్పుడు చెయ్యకుండా కొండదిగే 'టెక్నిక్' తెలియదతనికి. అతను కొండ దిగివుంటే అతని బూట్లకు తగిలి క్రిందకు దొర్లే రాళ్ళ చప్పుడు వినిపించేది నాకు. ఇంతసేపు ఆ శవందగ్గరే వున్నాడా? లేక నేను ఇలా వూహించి మళ్ళీ పైకే వస్తానని నాకోసం ఏదన్నా వలపన్ని వున్నాడా?

ఒక్కక్షణం పెద్ద బండచాటున ఆగి ఊపిరి పీల్చుకొ న్నాను. బండారీకి నేను కనిపించననే నమ్మకం నాకున్నది. ఇవ తలి వైపున వున్న నన్ను చూడాలంటే అతను కొండ చివరి కంటూ వచ్చి చూడాలి. అతని బూట్లశబ్దం నాకు వినిపించక

మానదు. నేనున్న బండచాటునుండి ఒకసారి జాగ్రత్తగా తొంగి చూశాను పైకి. ఎక్కడా పచ్చదనం లేకుండా విచిత్రమైన రంగులో మెరుస్తోంది కొండంతా.

జాగ్రత్తగా పైకి ఏరకంగా ఎక్కాల్సింది దారి నిర్ణయించు కొన్నాను. ఒకవేళ బండారీ పైనుండి నాకోసం చూస్తుంటే అర సెకనుకన్నా ఎక్కువ అతనికి కనిపించకుండా నేను పైకి వెళ్ళే మార్గమంతా నాకు బండలు అడ్డుగా వుండేట్లు ఎన్ను కొన్నాను. చకచకా ఒక బండచాటునుండి మరో బండచాటుకు లేడిలా గెంతసాగాను.

పదిపన్నెండు గజాల్లో పైకి చేరుకొంటాననగా ఓ బండ రాతివెనుక ఆగాను. ఎక్కడో రాళ్ళుకదిలిన చప్పుడు వినిపిస్తోంది. బండారీ నన్ను చూశాడా? నేనున్నవైపు మెల్లగా కదలి వస్తు న్నాడా? చెవులు రిక్కించి ఆ శబ్దాన్ని వినసాగాను. మళ్ళీ వినిపించలేదు. తలమీదనుండి చమట కళ్ళలోకి కారుతోంది. పెదిమలు అప్పుడే ఆరిపోతున్నట్లున్నాయి. నాలిక తడి చేసు కుందామని ఆగిపోయాను. ఆరకంగా చెయ్యడంవలన ఒంటిలో వున్న కొద్దిపాటి నీరును వృధాచెయ్యడం అవుతుంది. పెది మలు తడి చేసుకొన్న మరుక్షణం ఈ వేడికి అవి ఆరిపోతూ వుంటాయి. అంచేత పెదిమలు తడి చేసుకోవడంవలన ప్రయో జనం లేదు. శరీరంలోవున్న ప్రతి నీటి బొట్టూ దాచుకోవాలి.

అలసటగా బండను ఆనుకొన్నాను. వీపు చుర్రుమంది. మధ్యాహ్నమయ్యేప్పటికి ఈ కొండమీద చెప్పులు లేకుండా నిల బడడం కష్టమే. అప్పుడు విన్నాను ఆ శబ్దం మోటారు ఇంజను శబ్దం. అంటే బండారీ కిందకుదిగి వెళ్ళాడన్నమాట. నేను ఇందాకవిన్న రాళ్ళచప్పుడు బండారీ క్రిందకు దిగుతున్నప్పుడు అయిన శబ్దం అయివుండాలి.

ఒక్కసారి ఆనందంతో గెంతులు వేయాలనిపించింది. బండారీ ఇది నువ్వుచేసిన మొదటి పొరపాటు అనుకొన్నాను మనస్సులో. ఎంత పవర్‌ఫుల్ రైఫిల్ చేతిలోవున్నా ఏటవాలుగావున్న కొండమీద వున్న శత్రువును పట్టుకోవడం సులభం కాదు. అతనికి క్రిందవుండే నన్ను చంపడానికి ప్రయత్నించాలికాని, పైకివచ్చే ప్రయత్నం చేయలేడు బండారీ. అంత బుద్ధిహీనుడు కాడు బండారీ. అతను పైకివచ్చే మార్గంలో ఏ రాతిని దొర్లించినా అతనా ప్రమాధంనుండి తప్పుకోవడం చాలా కష్టం. అదృష్టం ఇంకా నాపక్షాన్నే వుందనిపించింది.

గబగబా కొండ పైభాగాన్ని ఎక్కేశాను. ఓ బండచాటు నుండి కొండ అవతలి వైపుకు తొంగిచూశాను. బండారీ జీపుని కొండదగ్గర్నుండి ఓ పర్లాంగు వెనక్కి తీసుకొని పోయాడు. అక్కడ జీపు ఆపి, ముందుసీట్లో కూర్చొని బైనాక్యులర్స్‌తో కొండని పరీక్షగా చూస్తున్నాడు. నాలోనేను నవ్వుకొన్నాను.

మెల్లిగా బండలచాటునుండి పూజారీ శవంవున్న ప్రాంతం వైపు నడిచాను. ఒక్కక్షణం నాకళ్ళను నేను నమ్మలేకపోయాను. కళ్ళముందు నీళ్ళు తిరిగాయి. పుజారి శవం మాయమయ్యింది. దానికికాదు నా బాధ. అప్రక్కనేవున్న నీటిగుంటల్లో నీళ్ళన్నీ బయటికి తోడివేయబడినాయి. గుంటల చుట్టూవున్న రాళ్ళమీద ఇంకా తడి కనిపిస్తోంది. గుంటల అడుగున ఒక్కచుక్క నీరుకూడా లేదు.

"మైగాడ్ బండారీ యుఆర్‌ఎ బాస్టర్డ్!" కసిగా తిట్టుకున్నాను. ఆ చుట్టుప్రక్కలవున్న నాలుగు గుంటల పరిస్థితి అలాగేవుంది. నేను మళ్ళీ ఎలాగో పైకి వచ్చినా నాకు నీళ్ళు దొరక్కుండా చెయ్యాలని ఈ పని చేశాడు బండారీ. ఆ పని

వల్ల నేనేకాదు ఆ గుంటలమీద ఆధారపడివున్న కొన్ని జంతువులుకూడా నీళ్ళులేక చస్తాయి. ఒక్కక్షణం నిరాశ ఆవరించింది నాకు.

మెల్లిగా ఆ చుట్టుప్రక్కల గాలించసాగాను, పూజారీ నివాసంకోసం. మధ్యమధ్య రాళ్ళచాటునుండి బండారీ ఎటువున్నాడో చూస్తూవున్నాను. ఒకసారి బండారీ లంచ్‌పాక్‌లో నుండి ఏదో తినడం కనిపించింది. చటుక్కున ఆకలి గుర్తొచ్చిందినాకు. ఈ ఎండకుతోడు ఆహారం లేకపోతే రేప్రొద్దునకు లేవడం కష్టం నేను.

దాదాపు గంటసేపు వెతికింతరువాత కనిపించిందది. నాలుగు పెద్ద బండరాళ్ళు ఒకదానిమీద ఒకటి పడి ఏర్పడిన చిన్న గుహలాంటిది. బయటికి చిన్న సందులాంటిది మాత్రం కనిపిస్తోంది. అంతే. లోపల మనిషివుండే అవకాశం వుందని తెలియడంలేదు. ఏందుకో దాన్ని కనుక్కొన్నాననే ఆనందం కలుగలేదు నాకు. నీరసంగా ఆ సందులోంచి ఆ రాళ్ళ మధ్యకు వెళ్ళాను.

7

పెద్ద పెద్ద బండరాళ్ళు ఒకదానిమీద ఒకటిపడి ఏర్పడిన గుహ అది. లోపలచాలా పొడిగా వెచ్చగాఉంది. ఆరడుగుల పొడవు, నాలుగడుగుల వెడల్పు సమానంగా వుంటుంది. బయటి నుండి నేనువచ్చిన సందులోనుండితప్ప వెలుగు రాకపోవడంవలన చీకటిగావుంది. ఒక్కక్షణం అలానే నిలబడి ఆ వెలుగుకు నా కళ్ళు అలవాటు పడేవరకూ వున్నాను.

చెప్పుకోదగిన వస్తువులేమీ లేవు లోపల. నేలమీద ఓప్రక్కగా చిరిగిపోయిన ఖర్జూరు ఆకులతో నేసినచాప వుంది. ఒక మనిషి పడుకోవడానికికూడా సరిగాచాలదు. ఓమూల నలు

చదరంగావున్న బండమీద రెండు మట్టిపాత్రలున్నాయి. చాప మీద ఓప్రక్క మరో తుండుగుడ్డలాంటి మాసినబట్ట పడి ఉంది. బండ ప్రక్కనే చిన్న సూట్‌కేసులాంటి చెక్కపెట్టె వుంది.

రెండుమట్టిపాత్రలనూ పరీక్షగా చూశాను. చిన్నదానిలో సగానికి ఏదో తెల్లటి పదార్థం వుంది. చెయ్యిపెట్టి పైకితీసాను. చిన్నచిన్న రాళ్ళగడ్డల్లా ఉన్నాయి. నోటిలో పెట్టుకొని చూసాను. ఉప్పగాఉంది. రాతిఉప్పు! రెండవదాంట్లో ఏదో రొట్టెలులాంటి వున్నాయి. అన్నీ బయటకుతీసి చూశాను. ముదురాకుపచ్చ రంగులో దాదాపునల్లగా చిన్నసైజు పూరీల్లా వున్నాయి.

ముక్కు దగ్గరపెట్టి వాసనచూశాను. ఏదోచిత్రమైన వాసనవేస్తోంది. చిన్నముక్కత్రుంచి నోట్లోవేసుకొని చప్పరించాను. వగరుగావుంది. పంటిక్రిందనమలాలని ప్రయత్నించాను. తేలిగ్గా నలిగేలా అనిపించలేదు. దాదాపు పది రొట్టెలున్నాయి. భద్రంగావాటిని మళ్ళీకుండలో పెట్టేశాను.

ఆరాతిఉప్పుతప్ప నాకుపనికొచ్చేవి ఏమీలేవు అందులో. మెల్లిగా చెక్కపెట్టె దగ్గరకులాగి పరీక్షగాచూశాను. మంగలి పెట్టెకన్నా చిన్నగాఉంది. మూత తెరిచాను. లోపలఉన్న వస్తువులుచూసి ఆశ్చర్యపోయాను!

తాతలకాలంనాటి అయిదంగుళాలు పొడవున్న చిన్న కత్తి ఉందిలోపల. దాంతోపాటు చిన్న కుంకుమభరిణ, నల్లపూసల దండ, అణాఎత్తు కర్పూరం ముద్ద, ఎండిపోయిననిమ్మకాయ ఒకటివున్నాయి. వాటితోపాటువున్న మరో వస్తువు నాకు చాలా ఆనందం కలిగించింది.

కాటబాల్! పంగలకర్ర అంటారు! చిన్నప్పుడు పక్షులను కొట్టడానికి ఉపయోగించేవాణ్ణి. 'V' ఆకారంలోవున్న చిన్న

ఇనుప తీగెకు రెండుచివర్లన ఒక సన్న రబ్బరుగొట్టం రెండు చివర్లు బిగించివున్నాయి. ఆ రబ్బరుగొట్టంకి సరిగ్గా మధ్య లో చిన్న తోలుముక్క కుట్టివుంది. ఆ తోలుముక్కలో చిన్నచిన్న గులకరాళ్ళుపెట్టి, ఒక చేత్తో ఆ ఇనుపతీగెను పట్టుకొని, రెండవచేత్తో రబ్బరు గొట్టాన్ని సాగదీసి వదిలి పెడితే గులకరాయి బుల్లెట్‌లా తగుల్తుంది, మనం గురిచూచిన వస్తువుని. చిన్నచిన్న పిట్టల్ని వేటాడడానికి బాగా ఉపయోగ పడుతుంది.

బహుశా ఆ పూజారి దీని సాయంతో ఇక్కడ ఎగిరే చిన్న చిన్నపిట్టల్ని వేటాడి ఆహారం సంపాదించుకొనేవాడనుకొంటాను. గుహలో అక్కడక్కడవున్న పక్షుల ఈకలు నా అనుమానాన్ని ధృవపరిచాయి. ఆఖరికి బండారీని ఎదిరించడానికి ఏదో ఒక రక మైన రెండు ఆయుధాలన్నా లభించాయి!

కాట్ బాల్‌ని మెడకు తగిలించుకొని, కత్తిని డ్రాయరు లో దోపుకొన్నాను. తినడానికి గుహలో ఏమీ లేకపోవడం విచా రం కలిగించిందినాకు. కాని, ఏరకమైన పిట్టలు దొరక నప్పుడు ఈ పూజారి ఏంతినేవాడో? ఆ రొట్టెలు తినేవాడా?

తినడానికి పనికొచ్చే రొట్టెల్లా లేవవి. తినడానికి కాక మరి దేనికవి? చెడిపోకుండా అందులో ఏదైనా కలపడం వలన ఆ రుచి వచ్చిందా వాటికి? హఠాత్తుగా తట్టిందినాకుఅప్పుడు. అవును అదే అయివుండాలి. ఇందాక నేను రుచిచూడ్డానికి నోట్లో వేసుకొన్న ఆ రొట్టెముక్కను నాకు తెలియకుండానే ఇంకా చప్పరిస్తూ వున్నాను. అప్పటినుండి ఎందుకో తెలియ కుండానే నాకు నీరసం తగ్గి, క్రొత్త ఉత్సాహం వచ్చినట్లు గమనించాను. అది ఆ రొట్టె ప్రభావమే అయివుండాలి.

చిన్నప్పుడు ఎప్పుడో 'మిన్నారోటీ' గురించి విన్నాను

కాని, దాన్నెప్పుడూ కళ్ళతో చూడ్డంగానీ, రుచిచూడ్డంగానీ జరగలేదు. ఇదివరలో దూర ప్రయాణాలు ఎడారిలో చేసే యాత్రికులూ వర్తకులూ, ఎప్పుడూ తమదగ్గర ఈ 'మిన్నా రోటీ' వుంచుకొనేవాళ్ళుట. బియ్యపుపిండి, గంజాయిమొక్క ఆకులూ కలిపి తయారు చేస్తారు. ఆకలి తగ్గించడానికి, శరీరంలో వుండే నిల్వశక్తిని బయటకు తేవడానికి ఈ రొట్టెను చిన్న చిన్న ముక్కలుగా చేసి చప్పరిస్తారు. ఆహారం కొరత ఏర్పడినప్పుడు దీని సహాయంతో చాలాకాలం ప్రాణాలను దక్కించుకొనేవాళ్ళుట. బహుశా ఈ పూజారికూడా ఈ ఎడారిలో తిండి లేనప్పుడు ఈ రొట్టె చప్పరించి ప్రాణాలను నిలబెట్టుకొనేవాడనుకొంటాను. మనసులోనే కాళీమాయికి కృతజ్ఞతలు చెప్పుకొన్నాను.

వీటి సహాయంతో నేను జాగ్రత్తగా సంచరిస్తూ, కాస్త నీరుదొరికే ప్రదేశాన్ని కనుక్కోగలిగితే బండారీనుండి తప్పించుకొని ప్రాణాల్తో బయటపడగలననే నమ్మకం ఏర్పడింది. చావ మీదవున్న ఆ మురికి తుండుగుడ్డలో ఆ రాతి వుప్పును, రొట్టెల్ని మూటగట్టాను.

బండారీ ఏంచేస్తున్నాడో చూద్దామని మళ్ళా బయటకు వచ్చాను. ఎండకు రాళ్ళు వేడెక్కి అరికాళ్ళు మండుతున్నాయి. బండల చాటునుండి లాండ్‌లోవర్ వున్నవైపుకు చూశాను. బండారీ ఫ్రంట్ సీట్లో కూర్చొని సిగరెట్ పీలుస్తూ కొండ వైపు చూస్తున్నాడు. బహుశా నన్ను ఈ కొండరాళ్ళ చాటు నుండి బయటకు ఎలా రప్పించాలా అని ఆలోచిస్తున్నాడనుకొంటాను.

ప్రస్తుతానికి బండారీనుండి నాకు ప్రమాదం లేదని నిశ్చయించుకొన్నాను. ఈ కొండమీద నేను వున్నంతసేపూ, నాకు

కాళ్ళు చేతుల్లో శక్తి వున్నంతవరకూ బండారీ నాదగ్గరకు రాలేడు. అతని రైఫిల్ గుళ్ళ బారీనుండి తప్పించుకోవడానికి నాకీ కొండరాళ్ళ అండ చాలు. కానీ నేనీ కొండపైన ఎక్కువ కాలం నీళ్ళులేకుండా వుండిపోతే రెండ్రోజుల తరవాతైనా దాహం వలన నాశక్తి క్షీణించక తప్పదు.

రాతివుప్పు వున్నా ఒంటిలోవున్న నీటిని బాగా వుపయోగించుకోవడానికి తప్ప ఎక్కువ దాహాన్ని తీర్చడానికి పనిచేయదు. ఆకలి సమస్య లేకపోయినా, నీటి సమస్యవల్ల నా ప్రాణానికి ముప్పు తప్పదు. త్వరగా నీరుదొరికే మరో ప్రదేశానికి నేను చేరుకోకపోతే ఈ బండారీ భూతానికి ఎదురొడ్డి నిలబడ్డం అసంభవం.

నేనున్న కొండకి ఎడమవైపున చివరగావున్న కొండ పై భాగాన పెద్ద నీటిగుంటలు వుంటాయని విన్నాను. కాని దాని పైకి నేనెప్పుడూ వెళ్ళలేదు. ఈ మధ్యలోవుండే కొండల్లో అక్కడక్కడా నీళ్ళు దొరికినా, బండారీ రైఫిల్ గుళ్ళను తప్పించుకొనేందుకు వీలైన పెద్దపెద్ద బండలు మాత్రంలేవు.

దూరంగా ఆ కొండకు దగ్గరగా ఎగురుతోన్న రెండు రాబంధువులు నేను విన్నవిషయాన్ని నిజమనిపించాయి. ఆ రాబంధువులు ఎగిరే ప్రదేశానికి దగ్గర్లోనే ఎక్కడో నీరువుంటుందన్నమాట. ఏలాగైనా ఆ కొండపైకి చేరుకోగలిగితే ప్రస్తుతానికి ప్రమాదం తప్పినట్లే. ఇలా మరో వారంరోజులు బండారీ బారీనుండి తప్పుకోగలిగితే ఆతర్వాత మావాళ్ళు తప్పకుండా మా ఇద్దర్నీ వెతుక్కొంటూ ఈ ప్రాంతాలకు వస్తారు.

కాని చీకటి పడేవరకూ నేను అటు వెళ్లే ప్రయత్నం చేయగూడదు. రాత్రిపూట చీకటి చాటున ఈ కొండలు దాటే ప్రయత్నం చేయాలని నిశ్చయించుకొన్నాను.

ఏందుకో ఒక్క క్షణం వెన్ను వణికినట్లనిపించింది. బండారీ నావైపే చూస్తున్నాడనే ఆలోచన చటుక్కున నాకు స్ఫురించింది. అసంకల్పితంగా దగ్గర్లోనున్న బండరాయి వెనక్కు చటుక్కున నక్కాను.

సంయ్ మని నా వెనక బండరాతికి ఏదో కొట్టుకొన్న చప్పుడూ, దానివెనకనే ధాం! మనే శబ్దం వినిపించాయి. రైఫిల్ పేల్చిన చప్పుడు. పేల్చివ ధ్వనికన్నా బుల్లెట్ త్వరగా గమ్యాన్ని చేరుకొంటుంది. నా ఆలోచనలోపడి బండారీని గమనించడం మరిచిపోయాను నేను. ఒక్క క్షణం ఆలస్యం అయి వుంటే బుల్లెట్ నా తలలోంచి దూసుకుపోయి వుండేది.

8

చీకటి పడేవరకూ ఆ బండలవెనుక బండారీని జాగ్రత్తగా గమనిస్తూ వుండిపోయాను. సాయంత్రం ఆరయేప్పటికల్లా బండారీ లాండ్ రోవర్‌ని ఇంకాస్త వెనక్కి తీసుకెళ్ళి ఆపాడు.

మెల్లిగా జీప్‌లోనుండీ కాంపింగ్ ఎక్విప్‌మెంట్ అంతా అన్‌లోడ్ చేసి చిన్న టెంట్ వేశాడు. టెంట్ ముందు చిన్న గొయ్యి తీసి అక్కడ మంట వెలిగించాడు. మంట మీద టీకెటిల్ పెట్టి టీ కాచడం మొదలుపెట్టాడు.

టీ కెటిల్ చూసి ఒక్కసారి మెల్లగా పెదిమలు తడువు కొన్నాను. పెదిమలు ఎండిపోయి బాగా పొడిగా తగిలాయి నాలికకు. బాగాదాహంగా వుంది. తలంతా బరువుగా ఎవరో లోపల సుత్తులతో బాదుతున్నట్లు వుంది. పొద్దున్న బ్రెక్ ఫాస్ట్‌లో త్రాగిన నీరు, టీ తప్ప ఆ తర్వాత మళ్ళీ ద్రవ పదార్థం అనేది ముట్టలేదు.

మామూలుగా మనిషి నీరు లేకుండా ఇరవై నాలుగు గంటల కన్నా ఎక్కువ వుండలేడు అంటారు. ఈ ఎడారి వేడిలో

మహా అయితే పద్దెనిమిది గంటలు వుండగలడేమో. ఆ తర్వాత దాహానికి పిడచకట్టుకుపోయి, పెదిమలకు నాలుకకు పై పొరలు రావడం తప్పదు. కళ్ళు విపరీతంగా మండు తోన్నాయి. ఎందుకో తెలియకుండానే ఏడుపొచ్చింది నాకు. కళ్ళమ్మట నీళ్ళురాకపోయినా, దుఃఖం లోపలినుండి పొంగి వచ్చి ఒక నిముషం పాటు శరీరాన్ని వణికించింది.

కళ్ళముందే బండారీ టీ త్రాగుతూ, రాత్రి భోజనం తయారుచేసుకొంటుంటే నా నిస్సహాయుత మీద నాకే జాలే సింది. ఇంకా కనీసం నాలుగు గంటలు ఆగితేకాని పూర్తిగా చీకటిపడదు. అమావాస్య వెళ్ళి ఇంకా రెండ్రోజులే కావడం నిజంగా నా అదృష్టం. లేకపోతే చెట్లుచేమలు లేని ఈ కొండల మీద చంద్రుడి వెలుగు ప్రతిఫలించి ప్రతీ వస్తువూ చాలా స్పష్టంగా కనిపిస్తుంది. నేను రాత్రుళ్ళు కదలడానికి కూడా వీలుండేది కాదు.

చీకటిపడింది, కాంప్ఫైర్ వెలుగులోనూ, టెంట్లోపలి గాస్లైట్ కాంతిలోనూ బండారీ అటూ ఇటూ తిరగడం స్పష్టంగా కనిపిస్తోంది. ఏ పని చేస్తున్నా రైఫిల్ మాత్రం అతని చేతులోనే ఎప్పుడూ వుండడం గమనించాను నేను. దాదాపు పది గంటల ప్రాంతంలో బండారీ టెంట్లో పెట్రో మాక్స్ లైట్ ఆరిపోయింది.

రోజంతా ఈ ఎడారి ఎండలో వుండడం వలన, ఎండ వేడికి మనుషులు చాలా త్వరగా అలిసిపోతారు. అంచేత బండారీ కూడా త్వరగా నిద్రపోతాడని నాకు తెలుసు. రాత్రిళ్ళుఅతన్ని తప్పించుకొని నేను పారిపోతాననే భయం అతనికి లేదు. తెల్లవారేలోపు పద్దెనిమిది గంటల్లోనూ నేను మహా వెళ్ళ గలిగితే ఓ పదిమైళ్ళు వెళ్ళగలనేమో ఈ స్థితిలో. రోజంతా ఈ

కొండగుట్ట మీాదే ఆహారం, నీరు లేకుండా వున్న నేను అంతకంటే ఎక్కువ వెళ్ళలేనని బండారీకి తెలుసు.

అదీకాక ప్రొద్దునే లేచి కొండ చుట్టు ఓసారి తిరిగితే సన్నని గాలికూడా వీయని ఈ సెప్టెంబర్ రోజుల్లో నా అడుగు జాడలు చాలా స్పష్టంగా ఇసుకలో కనిపించక మానవు. ఒక్కసారి కొండగుట్టెక్కి నా అడుగుజాడలు వెళ్ళినవైపు చూస్తే నేను తప్పకుండా బండారీకి కనిపించి తీర్తాను. ఆ తర్వాత అతను నన్ను చేరుకోవడం నిముషాలమీాది పని.

ఒక వేళ అతను నన్ను వెంబడించకపోయినా, మర్నాటి ఎండ నన్ను ఎడారి దాటనివ్వదనే విషయం చాలా స్పష్టం. అంచేతా నేను ఎడారిలో నడిచే ప్రయత్నం చెయ్యనని. ఈ కొండలోనే నాకు బ్రతకడానికి ఎక్కువ అవకాశం వుందని బండారీ ఊహించలేని మూర్ఖుడు కాడు. అంచేత బండారీ సుఖంగా నిద్రపోతాడని నాకు తెలుసు.

బండారీ లైటు ఆర్పేసిన తరువాత ఓ అరగంట వరకూ టెంట్‌వైపే కళ్ళు చిట్లించుకొని చూస్తూ వుండిపోయాను. ఎడారిలో తిరగడం అలవాటులేని బండారీ రాత్రి పూట ఈ కొండ ఎక్కే ప్రయత్నంచెయ్యడని తెలుసు. అయినా నా జాగ్రత్తలో నేను వుండడం మంచిది.

చీకట్లో ఏమీా కనిపించడంలేదు. ఆకాశంలో నక్షత్రాల వెలుగు తప్ప మరో వెలుగు లేదు. ఒక్కసారి కొండ దిగి వెళ్ళి నిద్రపోతున్న బండారీ మీాద పడి దాడిచేయాలనే పిచ్చి ఆవేశం వచ్చింది, ఒక్కక్షణం. కాని అది జరిగే పని కాదని తెలుసు. బండారీ పొరపాటున మేలుకొని నా కోసం కాచుకొని వున్నా, నేను వస్తున్న శబ్దం విన్నా. మరుక్షణం నేనీలోకానికి గుడ్‌బై చెప్పేయాల్సి వస్తుందనే విషయం నేను మరిచిపోలేదు.

మెల్లిగా కొండ అవతలివైపుకు ఎడారిలోకి దిగడం ప్రారంభించాను. చప్పుడు చెయ్యకుండా క్రిందికి దిగింతరువాత కాసేపు నీరసంగా అలాగే ఇసుకలో కూలబడ్డాను. కొండమీద బండలవెనుక కూర్చోని వున్నపుడు తెలియలేదు కాని, కొండ దిగేప్పుడు కాళ్ళకు బాగా పని కల్పించేప్పటికి తెలిసింది నాలో శక్తి ఎంత తగ్గిపోయిందో.

కాళ్ళకండరాలు ఎవరో బిగించి పట్టుకొన్నట్లు, ప్రతి అడుక్కీ ముడుచుకు పోతున్నట్లు అనిపించి విపరీతంగా బాధ పెడుతున్నాయి. దానికితోడు దాహం, రాతిఉప్పు నోట్లో వేసుకొన్నా, ఒంట్లో నీరు చాలా తక్కువగా వుండడంవలన లాలాజలం ఏ మాత్రం రావడంలేదు. పైగా ప్రొద్దుననుండి అప్పుడప్పుడూ చప్పరిస్తున్నా నేమో, నాలుక అంతా అక్కడక్కడా తెగి నోరంతా ఉప్పుగావుంది.

నోట్లో 'పిన్నారోట్' చప్పరిస్తూ, మనసులో భగవంతుణ్ణి ప్రార్థిస్తూ బయలుదేరాను. ఈ మధ్యలో వుండేకొండలో ఎక్కడయినా నీరువుంటే వుండొచ్చుగాని, ఆ నీటి గుంటల్ని వెతికి పట్టుకొనే సత్తువలేదు నాకు. పైగా ఆలోగా తెల్లవారిపోతే బండారీ రైఫిల్ గుళ్ళు తప్పించుకొనే అవకాశం లేదు నాకు.

ఓ పదినిముషాలు అలా కూర్చోన్న తరువాత మెల్లిగా లేచి నిలబడ్డాను. తర్వాత ఆ చీకట్లోనే దారిచూసుకొంటూ ఆ చివరవున్న కొండకేసి బయల్దేరాను. అలా ఎంతసేపు ఆ కొండలను అంటిపెట్టి నడిచానో నాకే తెలియదు. నడుస్తూ వుంటే వేసే ప్రతి అడుగుకూ దూరం మరింత పెరుగుతోన్నట్లు అనిపిస్తోంది. ఈ బాధల చివర్న ఎక్కడో ఈ దాహంతీరే అమృతం లభిస్తుందనే ఆశ నన్నంత సేపు నడి

పించింది.

బహుశా ఆరేడు గంటలు అలానే నడిచాను, మధ్య మధ్య ఓ అయిదు, పది నిముషాలు విశ్రాంతి తీసుకొంటూ. విశ్రాంతి కోసం ఆగిన ప్రతిసారీ ఇక కదలలేననిపించేది. తిరిగి అడుగులు వెయ్యడానికి బ్రహ్మ ప్రయత్నం చెయ్యాల్సివచ్చేది. దానికి తోడు దాహం. భరించలేని దాహం. పెదిమలుపగిలి మంట పుట్టడం ప్రారంభించాయి. నాలికతో తడుపు కొందామన్నా, నాలుక కదిపితే భరించలేని నొప్పిపుట్టింది. మిన్నరొట్టె చప్పరించడానికి కూడా శక్తి చాలాక చిన్న చిన్న ముక్కలుగా చేసి ఓ రొట్టె మింగాను. గొంతులో కూడా తడి లేకపోవడం వలన బలవంతంగా మింగాల్సి వచ్చింది.

ఈ పరిస్థితిలో రాత్రి ఎడారి దాటాలని నేను ప్రయత్నించివుంటే నిజంగా వృథాప్రయత్నం అయ్యుండేది. ఈ మూడు నాలుగు మైళ్ళపొడవున్న కొండతీరం నడవడానికే నాకు ఆరు గంటలపైన బడితే, ఎడారిలో మరో రెండు మైళ్ళ కన్న ఎక్కువ నడవగలిగే వాణ్ణికాదేమో.

నేను ఎక్కవలసిన కొండను చూడగానే ఒక్కక్షణం మనసు నిరాశ ఆవరించుకొంది. దూరంనుండి చూసినంత తేలిగ్గా కనిపించలేదు, ఆ కొండ ఎక్కడం. క్రింది నుండి దాదాపు ఇరవై అడుగుల ఎత్తువరకూ ఎవరో పని గట్టుకొని పదునుచేసినట్లు, ఎక్కడా చేతికిగాని, కాలుకుగాని పట్టు దొరకడానికి వీల్లేకుండా నున్నగా వుంది. పైగా పెద్ద ఏటవాలు తనంలేకుండా దాదాపు తిన్నగా వున్నట్లు మొదట్లో కండని స్తంభంలా వుంది. ఇంత దూరం నడిచిరావడం వృథా అనిపించింది.

మెల్లిగా కొండచుట్టూ ప్రదక్షిణ మొదలెట్టాను. ఎక్క

డైనా పైకి ఏక్కడానికి పట్టు దొరుకుతుందేమో చూద్దామని. ఆ క్షణంలోనే మరో విషయం స్ఫురించింది. నాకు ఏలాఅయినా ఈ కొండపైకి ఎక్కగలిగితే, బండారీ నన్నువెంటాడి పైకి వచ్చే అవకాశంలేదని. ఈ ఆలోచన మరింత బలాన్నిచ్చిందినాకు. కొండలో ఎక్కడైనా చిన్నపగులు, కొద్ది ఎగుడు దిగుడు కని పిస్తే దాని సహాయంతో పైకి వెళ్ళాలని అతి జాగ్రతగా వెతక సాగాను. కాని ఎక్కడా ఏమి సందు కపిపించలేదు.

తూర్పున వెలుగు రేకలు కనిపించడం మొదలుపెట్టాయి. నాగుండె మరింత వేగంగా కొట్టుకోవడం మొదలుపెట్టింది. మరి కాసేపట్లో నేను ఏదోవిధంగా పైకి చేరుకోకపోతే చావు తప్పదు. నావెనక ఎవరో రొప్పుతూ పరిగెడుతున్న చప్పుడయింది. ఒక్క క్షణం గుండెలు ఆగి కొట్టుకోవడం మొదలుపెట్టాయి. బండారీ వచ్చేశాడా?

నిస్పృహగా వెనక్కి తిరిగాను. మరుక్షణం ఆనందంతో అరవాలనిపించింది. ఎడారి రేచు ఒకటి దూరంగా ఆగి నావైపే తీక్షణంగా చూస్తోంది. నేను ఊపిరి బిగబట్టి దానివైపే చూడసాగాను.

రేచు ఈ ప్రాంతంలో, ఈసమయంలో తిరుగుతుం దంటే, ఇక్కడే ఎక్కడో నీరు దొరికే ప్రదేశం వుందన్నమాట. ఈ రేచు ఎటు వెళ్తుందో గమనిస్తే, దానివెనకే నేనూ వెళ్ళ వచ్చు ఆ నీటిదగ్గరకు. రేచు అలాగే నావైపు కాసేపు చూసి చెంగున గెంతి కొండ వంపువైపు పరిగెత్తింది.

నేనూ శరీరంలోని శక్తినంతా కూడగట్టుకొని దాని వెనకే పరిగెతాను. ఒక్కసారి తూలి క్రిందపడ్డాను. మెల్లిగా లేచి కొండ వంపువైపు నడిచాను. రేచు కనుపించలేదు. జాగ్ర త్తగా ఇసుకలో దాని కాలి గుర్తులవైపు చూస్తూ వెళ్ళసాగాను.

ఆ అడుగుజాడలు కొండ వంపుతిరిగి కొండవతలివైపు దారి తీశాయి.

ఎక్కడో గుర్రుమన్న విచిత్రమైన శబ్దం వినిపించింది కొండపైనుండి. రేచు అరుపు అదని తెలుసునాకు. తలెత్తి అటువైపు చూశాను. పైన కొండ అంచునుండి నావైపు తొంగి చూసి మళ్ళీ మాయమయింది. చెప్పలేని ఉత్సాహం వచ్చింది నాకు. అంటే ఈ ప్రాంతాల్లోనే పైకి ఎక్కడానికి అనువైన చోటు ఎక్కడో వుందన్నమాట.

మెల్లిగా రేచు కాలిగుర్తులను అనుసరిస్తూ ముందుకు వెళ్ళాను. చీకట్లో వెతకటం వలన నేను గమనించలేక పోయి వుండాలి. కొండకి ఓ ప్రక్క పెద్ద రాతిపగులు భూమినుండి దాదాపు ఐదడుగుల పైనుండి వుంది. రేచు అడుగులు అక్కడ వరకు వచ్చి ఆగిపోయాయి. అంటే అది ఇక్కడనుండే పైకి ఎక్కి వుండాలి. రొట్టెల మూటను వీపుకు కట్టాను.

మెల్లిగా ఆ పగులుమధ్య చేతులు ఇరికించి పట్టుకొని పైకి లేవడానికి ప్రయత్నించాను. రెండు చేతులు దాంట్లో పట్టించడం కష్టం. పైకి వెళ్ళేకొలదీ వెడల్పుగా వుంది. కొది గా ఎగిరి రెండుచేతుల్తో పగులువున్న రాతిని గట్టిగా పట్టుకు న్నాను. ఆ తర్వాత రెండు కాళ్ళనూ కొండకు తన్నిపట్టి ఒక చేతి పట్టును వదిలి ఇదివరకటి చోటుకు కాస్త పైన పట్టు కొన్నాను. మళ్ళీ అతి కష్టంమీద. ఒకచేతిమీద బరువంత వేళ్ళాడేట్టువుంచి, గోడకు కాళ్ళుతన్నిపట్టివుంచి, రెండవ-చేతిని పైకి జరిపి పట్టుకొన్నాను.

ఏక్షణాన శక్తి పోతుందా, ఏచేతి పట్టును వదిలేస్తానో అని ప్రతిక్షణం గుండె దడదడ లాడుతూనేవుంది. అలా మెల్లి మెల్లిగా పైకి జరుగుతూ మెల్లిగా ఒక పాదాన్ని ఆ సందులో

ఇరికించాను. అప్పుడు తట్టిందినాకు. ఆ రేచు ఎంత కొండల్లో తిరగటం అలవాటు పడినా ఇంతఎత్తు ఇలా ఎక్కడానికి అవకాశం లేదని. రేచు దాదాపు ఆరేడు అడుగుల ఎత్తు ఎగరగలదు. కాని మనిషిలా గోడలు పట్టుకు వ్రేలాడుతూ పైకి ఎక్కలేదు. అంటే ఇంతకన్న సులువుగా అది పైకి వెళ్ళగల మార్గం వుండే వుండాలి. కాని దాదాపు ఏడడుగులు పైకి వచ్చింతర్వాత మళ్ళీ క్రిందికిదిగి వెళ్ళే ఓపిక, శక్తి వుందనిపించలేదు నాకు.

రెండుకాళ్ళూ ఆ సందులో ఇరికించి, పిల్లిలా ఆ కొండ గోడకు అత్తుకొని వున్నాను. రెండుకాళ్ళమీద బరువు ఆనించ డంవల్ల కాస్త చేతులకు శ్రమ తగ్గంది. ఒక చేతిని పట్టు నుండి తీసేసి సందులో చేయి పెట్టి వెతికాను. కొండగోడ లోపలి అంచు తగిలింది. అంటే పగులు వున్న రాయి ఎక్కువ మందం లేదన్న మాట.

రెండు చేతుల్ని లోపలి అంచువైపు పట్టువేసి మెల్లగా నిచ్చెనలా ఆ సందులో నుండి పైకి ఎక్కసాగాను. దాదాపు పది అడుగులు పైకి ఎక్కేప్పటికి నా శరీరం అంతా పట్టేంత పగులు వుంది. మెల్లిగా శరీరం అంతా పగుల్లో ఇరికించిం తరువాత ఇక పైకి ఎక్కడం కష్టం అనిపించలేదు.

ఆ ఇరవై అడుగులు పైకి వెళ్ళింతరువాత కొండ చక్కగా ఏటవాలుగా ఉంది. ఆ సందులో నుండి రెండు చేతుల మీద ఆనుకొని పైకి ఎక్కాను. కొండంతా బోడి గుండులా నున్నగా ఎక్కడా వేరే రాళ్ళు లేకుండా, ఏకరాయి లా వుంది. మెల్లిగా ప్రాక్కుంటూ ఇంకా పైకి వెళ్ళాను. ఇలా పైకి ఎక్కుతున్నప్పుడు ఒక్కసారి కూడా క్రిందకు చూాల్లేదు.

మరో ఇరవై అడుగులు పైకి వెళ్ళింతరాత్వ కొండనిండా

అక్కడక్కడా పెద్దపెద్ద రాళ్ళు అడ్డదిడ్డంగా పడివున్నాయి. ఏటవాలుతనం పోయి కాస్త బల్లపరుపుగావుంది ఇక్కడ. మెల్లిగా ప్రతి రాళ్ళసందునా నీటికోసం వెతకడం మొదలుపెట్టాను.

కేవలం నా అదృష్టంవల్ల ఆ నీటిని కనుక్కోగలిగాను అంతే! ఏలా ఏర్పడిందో ఎప్పుడు ఎర్పడిందో... నేను ఊహించ లేను... బహుశా భూమి పుట్టినపుడు భూమిలో లావా పైకి వచ్చి గట్టిపడుతోన్నప్పడు ఏర్పడివుండాలి ఆ సొరంగం. చాలా ప్రకృతి సిద్ధంగా ఎర్పడిన చిన్నసొరంగం. దాదాపు అర డుగుల వెడల్పున భూమిలోకి త్రవ్వినట్లు ఏటవాలుగావుంది.

దాదావు పది అడుగుల లోపల పల్లంలో మోకాలు లోతున నీళ్ళున్నాయి. ఎప్పుడో సంవత్సరానికోసారి వాన కురి సినప్పుడు, నీరు సొరంగంలోని ఈ పల్లంలోకి ప్రవహించి వుండాలి. సొరంగం అనడంకన్నా గుహ అంటే బావుంటుం దేమో ఈ ప్రదేశాన్ని. దాన్నిండావున్న పక్షుల రెట్టలు, పక్షులు ఎప్పుడూ ఇక్కడే నీళ్ళు త్రాగులాయనే విషయాన్ని స్పష్టం చేస్తున్నాయి.

ఒక్కసారి ఎగిరిదూకి ఆ నీళ్ళల్లో మునిగిపోవాలనిపించింది. నీటిచుక్కలేని ఈ ఎడారిలో నాకు ఈ జలాశయం దొరకడం కేవలం నా అదృష్టం. నీటిలో పూర్తిగా తడవాలనే కోరికను బలవంతంగా చంపుకొంటూ, మెల్లిగా ఆ నీటిప్రక్కనవంగి దోసిలినిండా నీరుపట్టి త్రాగాను. చప్పగా, ఏరుచీ లేనట్లు నిలువగా వున్నాయి. అయితేనేం ఆ దోసిలినీళ్ళు నాకెంతో శక్తి నిచ్చాయి.

ఒక్కక్షణం ఆగి గబగబా ఓ పదిదోసిళ్ళ నీరు త్రాగాను. నీళ్ళుతాగిన మరుక్షణం నిద్ర ముంచుకువస్తున్నట్లనిపించింది. తృప్తిగా, ఆనీటిప్రక్కనే గుహలో కళ్ళుమూసుకొని నిద్ర

పోయాను.

6

మెలకువ వచ్చేప్పటికి సూర్యుడు చాలా పైకి వచ్చేశాడు. దాదాపు పదిగంటలు అయ్యుంటుంది. గుహలో ఉక్కగాఉంది. మొహంనిండా చెమటపట్టివుంది. నేను మెలకువవచ్చి కదలగానే నీళ్ళు తాగుతున్న పక్షులు చప్పుడుచేసుకొంటూ ఎగిరిపోయాయి. మెల్లిగా సొరంగంలోనుండి బయటికివచ్చి బండారీవున్న దిక్కు వైపుకు చూశాను.

గుడారంకాని, జీప్‌కాని, బండారీ జాడకాని కనిపించలేదు. ఒక్కక్షణం బండారీ వెళ్ళిపోయాడేమో అనే సందేహం కలిగిందినాకు. కాని రిస్క్ తీసుకోవడం బండారీ చెయ్యడనిపించింది. ఎందుకంటే బండారీ తిరిగి అహ్మదాబాద్ వెళ్ళాలంటే మావూరుమీదుగానే వెళ్ళాలి. మావాళ్ళకు సరైన సమాధానం చెప్పకుండా బండారీ వెళ్ళగలడని నేననుకోను. నేను ఈ కొండల్లో చచ్చిపోయానని చెప్పినా మావాళ్ళు నా శవం వెతకడానికైనా వస్తారు.

ఆ ఆలోచన మరుక్షణం నిజమయింది. దూరంగా ఏక్కడో జీపుచప్పుడు వినిపించింది. వెనక్కుతిరిగి చూశాను. బండారీ జీపులో కొండచుట్టూతిరిగి వస్తున్నాడు అవతలివైపు నుండి. చటుక్కున బండచాటున దాక్కున్నాను.

నేనున్న కొండదగ్గరగా రాగానే జీపు ఆగినశబ్దం వినిపించింది. మెల్లిగా బండలచాటునుండి తొంగిచూశాను. బండారీ జీపుదిగి క్రిందనేలను పరీక్షిస్తూ నడుస్తున్నాడు. బహుశా ఇసుకలో అతనికి నా అడుగుల జాడలు కనిపించివుండాలి. అతని చేతిలోని రైఫిల్‌మీద ఎండపడి మెరుస్తూ కనిపిస్తోంది.

మెల్లిగా కొండఅంచుకు నడిచి జాగ్రత్తగా నేలచాటున

పడుకొని తొంగిచూశాను. నాఅడుగుజాడలవెంట ముందుకు కదుల్తున్నాడు. కొండ వంపుతిరిగి కొండ పగులువున్న చోటుకు నడవసాగాడు. నేను చేతితో ఎత్తగలరాయి దొరుకుతుందేమో నని చుట్టూ చూశాను. అన్నీ బరువైన పెద్దపెద్ద రాళ్ళుతప్ప నేను కదల్చగలిగిన రాయి ఒక్కటీ కనిపించలేదు. మళ్ళీ క్రిందకు చూశాను.

చటుక్కున తల పైకెత్తి చూశాడు బండారీ. ఒక్కక్షణం మాఇద్దరికళ్ళూ కలుసుకొన్నాయి. వెంటనే తల లోపలికి తీస కొన్నాను. చటుక్కునలేచి నా గుహలోకి పరిగెత్తాను. గుండెల దడదడ మంటున్నాయి. ఇహనేనెక్కడున్నానో తెలిసింది కనుక నాకోసం ఓపిగ్గా కాచుకొని వుంటాడు బండారీ.

అతను ఏలాగూ ఈ కొండ ఎక్కలేడని నాకుతెలుసు. నేనైనా మామూలు పరిస్థితుల్లో ఆ పగుళ్ళలో కాళ్ళూ, చేతులుపెట్టి పైకొచ్చే ప్రయత్నం చేసేవాణ్ణికాదు. కాని తెగింపు వల్ల నాకాసాహసమూ, శక్తి కలిగాయి. పైగా ఈ కొండల్లో తిరగడంలో వున్న నా అలవాటు దానికి తోడయింది. పట్నవాసానికి అలవాటుపడిన బండారీ అంత కష్టపడతాడని నేననుకోను. తీరా పైవరకూ వచ్చింతరువాత నేనో తోపు తోస్తే అతను అంతులేకుండా పోతాడు. సరైనమార్గం లేందే బండారీ పైకిరాడని నాకు తెలుసు.

ఎందుకయినా మంచిదని చిన్నచిన్న గులకరాళ్ళు నాలు గయిదుఏరి దగ్గర పెట్టుకొన్నాను. అవసరమయితే కాట్ బాల్ లోకి పనికొస్తాయని. పదిగజాల్లోపల కాట్ బాల్ తో వదిలిన రాయి చాలా ప్రమాదకరం.

అనుకొన్నట్టుగానే బండారీ కొండప్రక్కనుండి కదలి వెళ్ళిపోయాడు. ఓ అయిదునిముషాల తరువాత లాండ్ లోవర్

స్టార్ట్ అయిన చప్పుడు వినిపించింది. జాగ్రత్తగా సొరంగంలో నుండి బయటికివచ్చి చూశాను. బండారీ జీపును కొండకు దూరంగా తీసుకెళుతున్నాడు.

దాదాపు నాలుగైదువందల గజాలు దూరంవెళ్ళిన తరువాత జీపుఆపి క్రిందకు దిగాడు. బైనాక్యులర్స్‌తో నేనున్న కొండను పరీక్షగా చూడసాగాడు. అతని కదలికబట్టి కొండను ఒక్కొక్క అంగుళమే ఆ పవర్‌ఫుల్ బైనాక్యులర్స్‌తో క్షుణ్ణంగా పరీక్షిస్తున్నాడనిపించింది. మెల్లిగా వెనక్కుతిరిగి సొరంగంలోకి వెళ్ళాను.

ఒక 'మిన్నిరోటీ' చప్పరిస్తూ మింగి నాలుగుదోసిళ్ళు నీళ్ళుతాగాను .నేలమీద చతికిలబడి ఏంచెయ్యాలో ఆలోచిస్తూ కూర్చున్నాను. అలా ఎంతసేపు గడిచిందో నాకు గుర్తులేదు. హఠాత్తుగా జీపు స్టార్టయిన శబ్దం వినిపించింది. చటుక్కున లేచినిలబడి బయటకువచ్చి జాగ్రత్తగా జీపువున్నవైపుచూశాను. ఒక్కక్షణం ఆశ్చర్యపోయాను నేను.

జీపు అక్కడే అలాగే కదలకుండావుంది. బండారీ ఇంకా బైనాక్యులర్‌తో నేనున్న కొండను గాలిస్తూనేవున్నాడు. మరయితే ఈ జీపుశబ్దం ఎక్కడిది. శబ్దం ఇంకా దగ్గరగా వస్తోంది. శబ్దం వస్తోన్నవైపు తలత్రిప్పి చూశాను. నా ఆనందానికి అంతులేదు!!

డిజర్ట్ వార్‌ఫర్ ట్రయినింగ్ సెంటర్ హెలీకాప్టర్ గరుత్మంతుల్లా ఎగురుతూ వస్తోంది. బండారీకేసి చూశాను. అతనూ హెలీకాప్టర్ వైపే చూస్తున్నాడు. బండరాళ్ళచాటు నుండి బయటికివచ్చి హెలీకాప్టర్‌కేసి చేతులూపసాగాను.

"హెల్ప్! హెల్ప్!"— అంటూ అరిచాను గట్టిగా ఎగురుతూ, చేతులూపుతూ. హెలికాప్టర్‌లో వాళ్ళు నన్ను చూ

నట్లు లేదు. అలాగే ఎగురుతుంది. క్రింద బండారీ కూడా దాని వైపు చూస్తూ చేతులు ఊపాడు. హెలికాప్టర్ కాస్త ముందుకు వెళ్ళి, గుండ్రంగా తిరిగి నే నున్న కొండ వైపు వచ్చింది.

ఆనందం పట్టలేక గట్టిగా అరుస్తూ చేతులు ఊపాను. ఎవరో హెలీకాప్టర్ కాబిన్‌లోనుండి చేతులు ఊపుతున్నారు. అర్థంకాలేదునాకు. నావైపు రమ్మన్నట్లు చేతులు ఊపసాగాను.

హెలీకాప్టర్ నేనున్న కొండపైన చుట్టూ ఓసారితిరిగి బండారీ ఉన్నవైపు కిందికి దిగసాగింది. నేను పిచ్చిగా అరుస్తూ ఊపసాగాను.

హెలీకాప్టర్ మెల్లిగా జీపుకు దగ్గర్లో క్రిందకు దిగింది. బాటిల్‌గ్రీన్ యూనిఫారంలోఉన్న ఇద్దరు అందులోనుండిదిగి బండారి జీపుదగ్గరికి నడిచారు. వాళ్ళిద్దరూ బండారీకి కాస్త దూరంలోఆగి ఏదో మాట్లాడారు. తర్వాత దగ్గరగా వెళ్ళారు. బండారీ వాళ్ళిద్దరితోనూ షేక్‌హండ్ చేశాడు.

తర్వాత బండారీ వాళ్ళతో ఏదోచెబుతూ నేనున్నకొండ వైపు చూపెట్టాడు. వాళ్ళిద్దరూ నేనున్నవైపు చూశారు. నేను మళ్ళీ గట్టిగా అరుస్తూ వాళ్ళవైపు చేతులువూపాను. హెలీకాప్టర్ రోదలో నాఅరుపు వాళ్ళకు వినిపించదని తట్ట లేదు నాకు. వాళ్ళిద్దరూ నావైపుతిరిగి చేతులు వూపి, బండారీతో షేక్‌హండ్‌చేసి తిరిగివెళ్ళి హెలీకాప్టర్‌లో కూర్చున్నారు. శిలాప్రతిమలా చూస్తూవుండిపోయాను నేను.

వాళ్ళకు అనుమానం కలగకుండా బండారీ ఏదో చెప్పి వుంటాడని తోచింది. హెలీకాప్టర్ మళ్ళీ గాల్లోకిలేచి గుండ్రంగాతిరిగి నేనున్న కొండవైపు వచ్చింది. ఏదో ఓరకంగా వాళ్ళను ఆకర్షించాలని గట్టిగా చేతులు ఊపసాగాను. హెలీ

కాప్టర్‌లోవాళ్ళు మళ్ళీ నావైపు చేతులుఊపారు... క్షణాలమీద హెలికాప్టర్ పార్‌మర్‌వైపుగా ఎగిరిపోయింది.

గట్టిగా ఏడ్వాలనిపించిందినాకు. కోపం పట్టలేక కొండని కాళ్ళతోతంతూ గుహలోకి వెళ్ళాను. నాకు తెలియకుండానే కళ్ళమ్మట నీళ్ళుకారుతున్నాయి. నేలమీద పడుకొని భోరున ఏడ్చాను.

10

చిన్నపిల్లాడిలా ఏడుస్తూ అలానే నిద్రపోయివుండాలినేను—హఠాత్తుగా ఏదో శబ్దం వినిపించేప్పటికి చటుక్కున మెల కువ వచ్చింది. చెవులు రిక్కించివిన్నాను. రెండు ఇనుప వస్తువులు ఒకదానికొకటి తగిల్తే వచ్చినశబ్దం... జాగ్రత్తగా విన్నతరువాత కొండ క్రిందివైపునుండి వస్తున్నట్లనిపించింది.

ఓ గుక్కెడు నీళ్ళుతాగి గుహలోంచి ప్రాక్కుంటూ బయటికి వచ్చాను. బహుశా సాయంత్రం నాలుగవుతుందేమో! సూర్యుడి ప్రతాపం చాలావరకు తగ్గిపోయింది. అయినా కొండంతా ఇంకా భరించలేనంత వేడిగావుంది. జీపు ఆగి వున్న వైపు చూశాను. ఇంకా అక్కడేవుంది. కాని బండారీ జాడ ఎక్కడా కనిపించలేదు. మళ్ళీ ఇనుపముక్కలు రాపిడవుతున్న శబ్దం వినిపించింది. మెల్లిగా బండలచాటునుండి పాక్కుంటూ కొండ అంచుకు ఆ శబ్దం వస్తున్న వైపు వెళ్ళాను.

ఒక్క క్షణం ఊపిరి ఆగినంతపనయింది నాకు. క్రిందికి చూసిన వెంటనే కాంప్‌టెంట్‌ను పాతడానికి ఉపయోగించే ఇనుప మేకుల్ని బండారీ అతిశ్రమతో కొండ పగుళ్ళోకి సుత్తితో దిగ్గొడుతున్నాడు. అంటే బండారిసులభంగా, ప్రమాదంలేకుండా కొండమీదికి చేరుకొన్నే ప్రయత్నం చేస్తున్నాడన్నమాట.

ఒక్కొక్క మేకు దాదాపు అడుగుపొడవుంటుంది. వాటిని

ఆ కొండ పగులులోకి దిగ్గొటి, పైకి రావడానికి నిచ్చెన మెట్లు లా తయారుచేస్తున్నాడు బండారీ. అడుగున్నరకు ఒకటి చొప్పున మూడు మేకులు దించాడు. నాలుగవ మేకు అతి ప్రయాసగా దించుతోవున్నాడు. అంత పనిలోనూ అతని భుజానికి రైఫిల్ వ్రేలాడుతోనేవుంది. అలాంటి మేకు మెట్లు పది పదిహేను అతను వెయ్యగలిగితే కొండమీద పట్టు దొరికే ప్రదేశానికి అతను తేలిగ్గా చేరుకోగలడు.

ఒక్క క్షణం మంత్రింపబడిన మనిషికి మల్లే చూస్తూ వుండిపోయాను. అలా తేలిగ్గా పైకి రావడానికి వీలుగా మెట్లుంటే, నేను రెండు చేతుల్తో అతన్ని ఆపగలగడం చాలా కష్టం. పైగా మెట్లు నిలబడ్డానికి ఆధారంగా వుండడవలన అతనికి ఒకచేత్తో రైఫిల్ వుపయోగించే అవకాశంవుంది. నేను పై నుండి ఏ బండారాయయినా అతనిమీద దొర్లించాలన్నా నిటారుగా వున్న కొండ శిఖరం మీద నుండి అతని మీదకు రాతిని దొర్లించడం దుస్తరం. పైగా నేను కదిలించగల రాళ్ళు కూడా ఆకొండ మీద లేవు. బైనాక్యులర్సులో నుండి బండారీ ఆ విషయం గమనించేవుంటాడు.

నేనెలాగూ ఎడారిలో పడి ప్రాణాలు పోగొట్టుకొనే ప్రయత్నం చెయ్యడంలేదు గనుక, తనే నా దగ్గరికి వచ్చే ప్రయత్నం చేస్తున్నాడు బండారి. ఈ కొండ మీద నన్ను సజీవంగా వదలి వెళ్ళిపోవడం అతనికి ప్రమాదకరం.

ఏం చెయ్యాలో తోచక గుడ్లప్పగించి చూస్తూవుండిపోయాను. చటుక్కున బండారీ మేకుదింపడం ఆపి తలెత్తి పైకి చూశాడు. నన్నుచూసి మేక పిల్లను చూసి ఆనందించే తోడేలులా నవ్వాడు. ఆ నవ్వులో ఏదో క్రూరమైన ఆనందం కనిపిస్తోంది. ఎందుకో తెలియని పిచ్చికోపం ఆ క్షణంలో

నన్నావహించింది. తుపుక్కున ఉమ్మును తుడుచుకొన్నాడ బండారీ. నా నిస్సహాయ పరిస్థితిని అతను బాగా అర్థంచేసుకో వుండాలి.

కొండ అంచునుండి మెల్లిగా వెనక్కి జరిగి నాగుహాకే నడిచాను. మనసులో బండారీ మీద ద్వేషం, కోపం, కసి సుళ్ళుతిరుగుతోంది. ఎందుకో తెలియకుండానే నాలోనేను ఓ నిశ్చయానికొచ్చాను. ఈ క్షణంవరకూ బండారీ వేటగాడిలా నన్నువెంటాడాడు. నేను ఎదురుతిరక్క ప్రతిక్షణం అతన్నుండి పారిపోతూవచ్చాను. ఎందుకని? నేనే ఎదురు తిరిగి అతనితో యుద్ధానికి దిగివుంటే ఏమయ్యుండేది? నా కన్నా అతనికున్న బలం ఏదుటి?

అతని రైఫిల్! నాదగ్గరా ఒ రైఫిల్ వుంటే ఈ పాటికి నేనే వేటగాడిని బండారీ లేడి అయ్యుండే వాడే. కాని నాదగ్గర రైఫిల్ లేదు. ఈ ఎడారిలో నాచేతికి మరో రైఫిల్ వచ్చే అవకాశంలేదు. కానీ నేను బండారీని సమాన బలంతో ఎదుర్కో వాలంటే రెండే మార్గాలున్నాయి. ఒకటి అతని చేతిలో రైఫిల్ లేకుండా చేయడం. లేదా ఆతని జీప్‌లో వున్న రెండవ రైఫిల్ని నాస్వాధీనం చేసుకోవడం.

మొదటిది అసంభవం అని తెలుసు. ఎందుకంటే బండారీ తన రైఫిల్ చేతిలో లేకుండా ఎక్కడికీ కదలడంలేదు. ఆ రైఫిల్ అతనగ్గరుండగా కనీసం అతని దగ్గరకు చేరుకొనే అవ కాశంలేదు. ఇకరెండవది. జీపులోని రెండో రైఫిల్ని స్వాధీనం చేసుకోవడం. మొదటి పద్ధతి కన్న దీనికి అవకాశంవుంది. మొదటిది జరగనిపని, ఇది కొద్దిగా తెగిస్తే జరిగే అవకాశం వుంది. కానిఎలా?

మరి కాసేపట్లో ప్రొద్దువాలబోతుంది, అంటే బండారి

మెట్లు కొట్టడం మానేసి. మళ్ళీ రేప్రొద్దున ప్రారంభించాలి. అరగంటకో మేకుచొప్పున బహుశా రేపుమధ్యాన్ననికి పై వరకూ మెట్లు కొట్టగలడు. ఆ తర్వాత అతన్ని నేను జయించే అవకాశంకాదుగదా! అతన్నుండి తప్పించుకొనే అవకాశంశూన్యం.

అంటే అతను పైకి వచ్చేలోపునే నేను ఆ జీపు దగ్గరికి వెళ్ళి ప్రయత్నంచెయ్యాలి. కానీ అతను జీపు దగ్గర వుండగా నేను అక్కడికి వెళ్ళలేను. అతను జీపు దగ్గర లేనప్పుడే నేను జీపును చేరుకొనే ప్రయత్నం చెయ్యాలి. జీపు చేరుకొని ఆ రెండో రైఫిల్ సంపాయిస్తే అతన్ని అటకాయించడం వీలవుతుంది.

రేపు ప్రొద్దున్న తిరిగి మేకులు కొట్టడానికి అతను పైకి ఎక్కగానే, నేను జీపులో రైఫిల్ స్వాధీనం చేసుకోగలిగితే నేను బండారీని జయించగలననే నమ్మకం నాకుంది. ఎందుకంటే జీపు దగ్గరికి నేను చేరుకోగలిగితే మేకుల నిచ్చెన మీద నిలబడిన బండారీ జీపు వైపుకు నేను వుంటాను. మేకుల మీద నిలబడి బండారీ వెనక్కు తిరిగి గురిచూసి నావైపు రైఫిల్ పేల్చే అవకాశం లేదు.

జీపులో వున్న మార్నెట్ రైఫిల్ రేంజ్ చిన్నదే అయినా, అతను క్రిందకు దిగేలోపున అతనికి రైఫిల్ గుండు తగిలేంత దగ్గరికి చేరుకోగలను కానీ జీపు దగ్గరికి చేరుకోవడంఎలా? బండారీ మేకులు కొట్టుతున్నప్పుడే జీపు దగ్గరికి వెళ్ళాలి. కాని ఈ కొండ మీదనుండి దిగే అవకాశమేలేదు. జీపు దగ్గరకు వెళ్ళడం ఎలా? పైగా బండారీ మేకులు కొడుతున్నప్పుడు జీపు చేరుకోవాలంటే పగలు ఆ పని జరగాలి. కాని పగలు వెలుతుర్లో బండారీ కన్ను కప్పి ఈ కొండదిగి జీపును చేరుకోవడం అసంభవం? ఏం చెయ్యాలి ?

మేకులు కొడుతున్న ధ్వని ఆగిపోయింది. ఎండ పూర్తి తగ్గిపోయింది. గుహలోనుండి బయటికి వచ్చి ఎడారిలో చూశాను. బండారీ మెల్లిగా నడుచుకొంటూ జీపు దగ్గరి వెళుతున్నాడు.

అలాగే బండచాటున కూర్చుని ఆలోచించసాగాను. ఎలా ఎలా? బండారీ పైకి వస్తే ఎలాగు నాకు చావు తప్పదు ఆలోగా కొంత రిస్క్ తీసుకొంటే నేనతన్ని ఓడించే అవకాశ వుందా? మనసంతా ఆవిషయంమీద లగ్నంచేసి ఆలోచించసాగాను

ఓ పథకం మెల్లిగా నామనసులో రూపం పోసుకోసాగింది ఒక్కసారి జీపునీ దాని పరిసర ప్రాంతాల్ని జాగ్రత్తగా పరీక్షి చాను. మనసులో ఆలోచనలు మళ్ళీ మళ్ళీ పునరావృతం చేసుకో సాగాను. ఆలోచించే కొద్దీ అంతకన్న మంచి పథకం. ఈ ప స్థితుల్లో వుండదనిపించింది.

మనసులోనే నిశ్చయించేసుకొని. మిగిలిన 'మిన్నింగో' పూర్తిచేసి, రాత్రి బాగాచీకటిపడ్డాక నా పథకం ఆమలు చేయ లని నిశ్చయించేసుకొన్నాను.

1

మొలలో వున్న చాకును, మెడలో తగిలించుకొన్న కా బాల్ని ఓసారి తడివి చూసుకొన్నాను. రొట్టెలు మూ కట్టుకు వచ్చిన గుడ్డనుచింపి రెండు కాళ్ళ పాదాలకు మడిచ చుట్టూ బూటులా చుట్టుకొన్నాను. కొండలోపలి అంచువై మెల్లగానడిచాను.

రాత్రిదాదాపు ఒంటిగంట అయింటుంది. నెలపొడ చంద్రునికాంతిలో ఏమీ స్పష్టంగా కనిపించడం లేదు. జా త్తగా రాళ్ళమధ్యనుండి కదులుతూ కొండఅంచుకు చేరుకొన్నా బండారీ జీపుదగ్గరగా వేసుకున్న గుడారంలో హాయిగా ని

ోతూవుంటాడు ఈ సరికి.

ఈ వైపు కొండఅంచు మరీ గోడలా నిటారుగా వుండ ండా కాస్త ఏటవాలుగావుంది. అంటే క్రిందినుండి ఎక్కడానికి లయినంత ఏటవాలు తనంకాదు. కానిపైనించి అతిజాగ్రత్తగా. లుకవగా దిగితే కొద్దిపాటి గాయాలతో దిగడానికి వీలయిన ఏట ాలుతనం. మధ్యలో ఎక్కడా కాలుకుపట్టు దొరకడానికి కూడా లులేనంత నున్నగావుంది కొండవుపరితలం. అయినా తప్పదు... పథకం అమలు జరగాలంటె నాకు కలిగే గాయాలకు లెక్క యకూడదు.

మెల్లిగా రెండు కాళ్ళను ముందు క్రిందికి పోనిచ్చాను. ారినప్పుడు మడమలు కొట్టుకపోకుండా వాటిచుట్టూవున్న ్డలు కొంత రక్షణ ఇస్తాయి. కాని పిరుదలకు, వీపుకు, ుజాలకు మాత్రం గీసుకపోకుండా ఏవిధమైన రక్షణలేదు. ళ్ళకు' చేతులకు తప్ప మరెక్కడ శరీరానికి గాయాలయినా రవాలేదు. కాని నేను కదలడానికి. పోరాడ్డానికి అవసరమైన ·టికి దెబ్బలు తగులుతే నాపథకం ఫలించడం చాలా కష్టం.

చిన్నప్పుడు జారుడుబల్లమీద క్రిందకు జారడానికి పైనే ార్చొనే పద్ధతిలో పొజిషన్‌లోకి వచ్చింతరువాత. రెండుచేతు ు ప్రక్కల అదిమిపట్టి, ఒక్కవూపులో ముందుకు కదిలాను. ిలడం మొదలవగానే రెండుచేతులనూ క్రిందతగలకుండా ్కితీసు కొన్నాను.

ఒక్క అరనిముషం పాటేమో, మెల్లగా కదిలాను. ఆ ్వాత నాశరీరం నాస్వాధీనంలో లేదు. విపరీతమైన వేగంతో రం క్రిందకు జారుతోంది. చూడ్డానికి నున్నగావున్నా జారు ంటె వీపు భుజాలు ఆవేగంరాపిడికి రాతిమీద గీకుకొనివిపరీ ుగా మండడం మొదలు పెట్టాయి. కాళ్ళకు కట్టుకొన్న

గుడ్డ పీలికలు వేగానికి అరిగి మడమలు కొట్టుక పోవడం మొదలు పెట్టాయి, ఏక్షణాన ఆవేగానికి ముందుకుతూలి, గాల్లోతేలి క్రిందికి పడిపోతాననే భయం ప్రతిక్షణం మండు తున్నా శరీరాన్ని రాతికే అదిమిపట్టే ప్రయత్నం నాతో చేయించింది.

అలా ఎంతసేపు క్రిందికి జారానో నాకే తెలియదు. వీపంతా అగ్నిగుండంలా మండుతూ వుంటే, ఆవేగంలో కాలాన్ని మరిచి పోయేను. హఠాత్తుగా నారెండు కాళ్ళు మెత్తని ఇసుకలోకి దిగి నయ్. ఆతాకిడికి శరీరం తూలి, గాల్లోకితేలి, ఎగిరి ఇసుకలో పడింది.

అయిదు నిముషాలపాటు అలాగే కళ్ళుమూసుకొని కదల కుండా ఆఇసుకలో వుండిపోయాను. వీపు, భుజాలు, మెడ, మోచేతులు' కాలిమడమలు విపరీతంగా మండుతున్నాయి. కాసేపటి తరువాత మెల్లగా లేచినిలబడ్డాను. లోతుగా గాయాలు తగలడం కాని, ఏవయినా ఎముకలు విరగక పోవడం కాని నిజంగా నా అదృష్టం.

నేను నిలబడ్డ ప్రదేశానికి చిన్నగా నాలుగయిదు వందల గజాల దూరంలో ఓపెద్ద బండరాయివుంది. బండారీ గుడా రానికి కూడా దాదాపు అంతేదూరంలోవుంది. నిలబడి నేనా బండరాయి చాటున దాక్కోవడం కష్టం .పొరపాటున బండారీ నేనక్కడ ఉన్నట్లు గమనిస్తే చావుతప్పదు.

మెల్లగా అడుగులో అడుగు వేసుకుంటూ బండవైపు నడవసాగాను. పదిగజాలు నడిచాక గుర్తొచ్చింది. ఇసుకలో బండారీ నాఅడుగుజాడలు గుర్తించే అవకాశం వుందని నాకాలికివున్న గడ్డలు విప్పివాటిని పేలికలుగా చేసి కుంచలా తయారు చేశాను. ఒక్కొక్క అడుగే వెనక్కి వేస్తూ, ఒక్కొక్క అడుగు జాడా

కుంచతో స్పష్టంగా కనపడకుండా చెరుపుతూ బండవైపు నడిచాను.

దాదాపు గంటన్నర పట్టివుంటుది నేనా బండచాటుకు చేరేప్పటికి. తర్వాత బండ ప్రక్కమ్మటి ఆరడుగుల పొడవు, రెండడుగుల వెడల్పున, దాదాపు ఓఅడుగులోతు వుండేట్లు గొయ్యి తియ్యసాగాను. చాలా జాగ్రత్తగా ఏమాత్రం చప్పుడు చెయ్యకుండా పూర్తిగా ఆగొయ్యితీసేప్పటికి దాదాపు తెల్లవారు జాము నాలుగయింటుంది.

కాట్‌బాలు నాకు దొరకడం నిజంగా నాఅదృష్టం అని చెప్పాలి ఎవర్నీ హింసించడానికి దాన్ని ఉపయోగించక పోయినా, ఈరోజు నాస్వరక్షణకు అదిబాగా వుపయోగపడింది. కాట్‌బా లోకి వున్న రబ్బరు ట్యూబును పిడినుండి ఊడ దీశాను. సన్నని రబ్బరు గొట్టం. అర్ధసెంటీమీటరు మందానవున్న గొట్టం అది. ఈచివరినుండిగాలి వుదితే ఏఅడ్డంకీ లేకుండా రెండోవైపు నుండి వస్తోంది.

రబ్బరు గొట్టాన్ని మధ్యకు రెండుముక్కలు చేశాను. తర్వాత ఆగోతిలో పడుకొని మెల్లిగా ఇసుకను నాశరీరంమీదికి లాక్కోసాగాను. పావుగంటలో నామెడవరకూ ఇసుకవచ్చేసింది. వీలయినంతవరకూ నన్నుకప్పిన ఇసుక బయటి ప్రదేశంలో సమా నంగా వుండేట్టుసర్దాను.

తర్వాత రెండురబ్బరు గొట్టాల్లో ఒకదాన్ని చేత్తో ఒక్క చెవిరంధ్రంలోకి వచ్చేట్టు పట్టుకొని, రెండవ కొనను గుంట బయటికి వుండేట్టు పెట్టాను. రెండవ గొట్టాన్ని నోట్లో పెట్టుకొని దాని కొసకూడా బయటికి వుండేట్లు పెట్టి, రెండవ చేత్తో నాముఖం మీదికి తలమీదికి కప్పేటట్లు ఇసుకను పోసుకొన్నాను. తర్వాత మెల్లగా రెండవచేతిని కూడా అతికష్టం

మీద లాక్కొన్నాను.

అంటె ఇప్పుడు నేనుపూర్తిగా ఇసుకలో కప్పబడి పోయానన్న మాట. నానోట్లోనూ, చెవిలోనూ వున్నరెండు రబ్బరు గొట్టాలే నాకు బయటి ప్రపంచంతో వున్న సంభంధం నోట్లోవున్న గొట్టం గాలిపీల్చుకోడానికి. విడవడానికి పనిచేస్తుంది. పొరపాటున నోటితో పీల్చడం మరచి ముక్కుతో గాలిపీల్చినా. ఇసుక ముక్కులోకీ గొంతులోకి వెళ్ళి ఉక్కిరి బిక్కిరయి నా సమాధిలోంచి బయటపడకతప్పదు. చెవిలోకి వున్న గొట్టంద్వారా బయట శబా లను వినడానికి వీలవుతుంది.

బండ చాటున గొయ్యితీసుకొన్నాను గనుక ఇసుకలో వచ్చిన తేడాలు బండారీ గమనించే అవకాశం లేదని అనుకొంటున్నాను. ఆరిస్క్ నేను తీసుకోవాలి. తప్పదు. వీపుమీద, కాళ్ళకు తగిలిన గాయాల్లో ఇసుక గుచ్చుకొని విపరీతమైన మంట, దురద పుడుతున్నాయి. అయినా నేను కదలడానికి వీలులేదు.

అలా ఎంతసేపు ఆ ఇసుక సమాధిలో వున్నానో నాకే తెలియదు. ఎన్నో గంటలు గడిచినట్లు అనిపిస్తోంది. సూర్యోదయమయిందో లేదో తెలియదు. ఉన్నట్టుండి నాపథకం మీద నాకే అనుమానం రావడం ప్రారంభించింది. ఆ సన్నని రబ్బరు గొట్టం బండారీ చేసే చప్పుళ్ళు నాకు వినిపించగలదా అనే అనుమానం నా మనసును తొలచడం ప్రారంభించింది.

ఈ ఇసుక మధ్యలోంచి తల బయటికి తీసి చూసే ధైర్యం లేదు నాకు బయటపూర్తి వెలుగువుండి, బండారీ ఇంకా జీపు దగ్గరేఉంటే బండారీకి తప్పకుండా కనిపించే అవకాశం వుంది. ఒక వేళ ఈ ట్యూబు ద్వారా ఏ శబ్దం వినిపించకపోతే ఎంతకాలం ఈ జీవ సమాధిలో వుండాలి? ఈ భయంకర పరిస్థితిలోంచి తప్పించమని మనసులోనే భగవంతుణ్ణి పదే పదే

ప్రార్థించసాగాను.

ఉన్నట్లుండి వినిపించింది. ఆ ధ్వని. ఎక్కడినుండో, సన్నగా వినిపించి వినిపించనట్లు వినిపించింది. నేనంత ఏకాగ్రతంలో వింటూ వుండకపోతే గమనించేవాణ్ణి కాదు. ఆదే ధ్వని సుత్తితో ఇనుప మేకులు కొడుతున్నచప్పుడు. పదినిముషాల పాటు అలానే ఆ శబ్దాన్ని వింటూ వుండిపోయాను. అంటే తెల్లవారిందన్నమాట. బండారీ బ్రేక్‌ఫాస్ట్ ముగించి మళ్ళీ మేకులు కొట్టడానికి వెళ్ళాడన్నమాట.

మెల్లిగా, జాగ్రత్తగా కదులూ, ఒక్కొక్క అంగుళం ఇసుకలోంచి బయటపడ్డాను. బండారాయి అడ్డం వుండడం వలన బండారీ ఇటువైపు చూస్తున్నా నేను కనిపించే అవకాశం లేదు. మెల్లిగా బోర్లాపడుకొని రాతిప్రక్కనుండి బండారీవైపు చూశాను. దీక్షగా ఆ గుడారం మేకులను కొండ గోడలోకి దించడంలో మునిగిపోయాడతను. అతని వీపు నావైపువుండడం వలన పూర్తిగా తలత్రిప్పిచూడందే నేను కనిపించే అవకాశం లేదు. ఆతనికి.

మరో క్రొత్త మేకు మొదలుపెట్టగానే మెల్లిగా బండ చాటునుండి లేచి జీపు వైపు కదలడం ప్రారంభించాను. గబగబా జీపు చాటుకు పరిగెత్తుకు పోవాలని ఎంత మనసు తొందర పెడుతున్నా, నా అడుగుల చప్పుడు బండారీ వింటాడేమోననే భయంతో ఎంతో మెల్లిగా అడుగులో అడుగు వేసుకొంటూ జీపు వైపుకు నడకసాగించాను.

ఆ పదిహేను నిముషాలు నా జీవితంలో మరపురాని భయంకర క్షణాలు. ఏ క్షణాన బండారీ మేకు దింపడం ఆపి వెనక్కి తిరుగుతాడో, ఏ క్షణాన నన్ను చూస్తాడో అని ఆత్రుతలో, భయంతో, అతిజాగ్రత్తగా నడిచాను. చివరికి ఎలా

నయితేనేం జీపు చాటుకు చేరుకొన్నాను. ఒక్క క్షణం ఆనం దంతో గెంతులు వేద్దామనిపించింది.

జీపు ప్రక్కనే గుడారం ఇంకా అలానే వుంది. గుడారం కాదు నాకు ముఖ్యం ఆ 22 హర్నెట్ రైఫిల్. ముందు సీట్లోకి తొంగి చూశాను. ఎక్కడా ఆ రైఫిలు సూచనలు లేవు స్పేర్ పెట్రోల్ డబ్బాలు తప్ప. మెల్లిగా వెనక బాడీలోకి తొంగి చూశాను. అక్కడా లేదు. అదంతా ఖాళీగావుంది. అంటే సామాన్లన్నీ గుడారంలో వున్నాయన్నమాట. గుడారానికి, కొండ కి మధ్య జీపు అడ్డం వుండడంవలన నేను గుడారంలోకి వెళ్ళ డం బండారీకి కనిపించే అవకాశం లేదు. చటుక్కున మెరుపులా గుడారంలోకి వెళ్ళాను.

లోపల అన్నీ నీటుగా సర్ది వున్నాయి. ఒక ప్రక్క స్టౌ, వంట వండుకొనే పాత్రాలు కిరోసిన్ డబ్బా, పెట్రోమాక్స్ లైట్లు వున్నాయి. మరో ప్రక్క బండారీ కాంప్ కాట్ పరిచి వుంది. కాంప్‌కాట్ పైన తలగడకు అడ్డంగా పడి 22 హర్నెట్ రైఫిల్ కనిపిస్తోంది.

ఒక్క గెంతుగెంతి దాన్ని అందుకొని చటుక్కున ముద్దు పెట్టుకున్నాను. క్రిందకు వంగి కాంప్‌కాట్ క్రింద నుండి బండారీ సూట్‌కేస్ బయటకు లాగి, తెరచి అందులో నుండి 22 బుల్లెట్లు బయిటికి తీశాను.

అప్పుడు తట్టింది నాకు... ఆ రైఫిల్లో ఏదో లోపం వున్నట్లు. అవును! రైఫిల్ నా చేతికి దొరికిన ఎక్సయిట్ మెంట్‌లో గమనించలేదు నేను. రైఫిల్‌బోల్టు బండారీ తీసే శాడు. రైఫిల్ ముఖ్యమైన, పార్టు అదే. చిన్నదయినా బోల్టు లేకుండా ఏ రైఫిల్ పనిచెయ్యదు.

నమ్మలేనట్లు నా చేతిలోని రైఫిల్ వంక కళ్ళప్పగించి

చూస్తూవుండిపోయాను. ఒక్క సారిగా పడిన శ్రమంతా వృథా అనీ, చావు తప్పదనే భావం నాధైర్యాన్ని, మనసును కృంగదీశాయి.

12

గుడారం అంతా ఒక్కచోటు కూడా వదలకుండా ప్రతి ప్రదేశంగాలించాను. ప్రయోజనం లేకపోయింది. ఎక్కడా ఆరైఫిల్ బోల్టు కనిపించలేదు. బోల్టు లేకుండా రైఫిల్‌ను ఏవిధంగానూ వుపయోగించే అవకాశంలేదునాకు. అంటే నేను ఇంత ఆలోచించి కష్టపడివేసిన పథకం వృదాఅయిందన్నమాట.

బండారీ ఎంత జాగ్రత్తమనిషో, రిస్కులను ఎలా వూహిస్తాడో అర్థమయిందినాకు. ఆలోచించడానికి బండారీకి అవకాశం ఇస్తే అతను ఎత్తుకు పై ఎత్తుకు, చదరంగం ఆటగాడులా ముందే వేసివుంచుతాడు. నిస్సహాయత ఆవహించి ఏమీతోచని వాడిలా నిలబడిపోయాను ఆ గుడారంమధ్యలో.

ఏందోచెయ్యాలి... చెయ్యకతప్పదు. కాని ఏంచెయ్యాలి? ఎలాచెయ్యాలి? అదేఅర్థం కావడంలేదు.

అప్పుడే బండారి పదడుగుల ఎత్తుకి మేకులు కొట్టేశాడు. మరో మూడు గంటల్లో అతనుకొండపైకి తేలిగ్గాచేరుకోగలడు కొండపైకి వెళ్ళింతరువాత నేనక్కడ లేకపోతే ఈ చుట్టు ప్రక్కల వేటకుక్కలా గాలించక మానడు. బండరాతి నుండి గుడారం వరకూ నేను నడిచివచ్చిన అడుగుజాడలు ఇసుకలో అతనికి స్పష్టంగా కనిపిస్తాయి. మధ్యాన్నంలోగా పైకివెళ్ళక పోయినా లంచ్‌కోసం వెనక్కితిరిగి రాకమానడు. అప్పుడయినా నన్ను అతను పనిపట్టితీరతాడు... తప్పదు... ఏదోచేసి తీరాలి నేను.

జీపుడాష్‌బోర్డ్‌లో కూడా బోల్టు కనిపించకపోయింతరువాత ఆ నిశ్చయానికి వచ్చానునేను. అతన్ని ఏదోరకంగా ఎత్తు

వేసి నాకు దగ్గరగా రప్పించగలిగితే అతనితో తలపడే అవకాశం నాకుంది. ఎంతో అకస్మాత్తుగా, ఊహించలేని సంఘటన ఏదేనా సృష్టిస్తేగాని అతను ఈజీపుకు, గుడారానికి దగ్గరగా వచ్చే అవకాశంలేదు.

మెరపులా ఓ ఆలోచన వచ్చింది నాకు. ఎంతో రిస్క్ కూడుకొన్న ఆలోచనఅది. అయినా ఆక్షణంలో అంతకన్న మంచి ఆలోచన స్ఫురించలేదునాకు. వెంటనే నాఆలోచన అమలు పెట్టడానికి నిశ్చయించుకొన్నాను.

గుడారంలోకివెళ్ళి స్టౌ దగ్గరున్న కిరోసిన్‌టిన్ను తెరచి కాంప్‌కాట్‌మీదా, తెరలమీదా పోశాను. తరువాత లైటు తుడవడానికి ఉపయోగించే కాటన్‌వేస్ట్, లైటును తీసుకొని బయటికి వచ్చాను. జీప్‌బాడీలోవున్న స్పేర్ పెట్రోలు టిన్నులు తెరచి కాటన్‌వేస్ట్ తడిపి, మిగిలినపెట్రోలంతా గుడారంమీద చల్లాను. లైటర్ వెలిగించి, కాటన్ వేస్ట్ ముట్టించి గుడారంమీద పడేలా విసిరేశాను.

'గుప్పున' పెద శబ్దంతో మండింది గుడారమంతా. పెట్రోలులో తడిసిన కేన్వాసు వెంటనే అంటుకొని మండసాగింది. నేను బొడ్డులోంచి కత్తితీసి పట్టుకొని జీపు ప్రక్కనేనక్కి దాక్కున్నాను.

గుడారం మండుతూ నల్లటిపొగ ఆకాశంలోకి సుళ్ళు తిరుగుతూ వెళుతోంది. రెండు నిమిషాల తరువాత బండారీ పరిగెత్తుకువస్తున్న అడుగుల శబ్దం వినిపించింది. ఊపిరిబిగబట్టి తయారుగా వున్నాను.

ఒక్కసారి హఠాత్తుగా మండినమంట బండారీని నిజంగా ఆశ్చర్యంలోముంచి, ఆలోచనను పోగొట్టి వుండాలి. ఏమాత్రం సందేహంలేకుండా గుడారంవైపు దూసుకువచ్చాడు.

బండారీ జీపు దాటగానే ఎగిరి అతనిమీదకు పులిలాగెం తాను. దూకుతోనే నాచేతిలోని కత్తిని అతని రైఫిల్‌వున్న భుజం మీద బలంగా దించాను. పెద్దగా కేకపెట్టి దబ్బున క్రిందపడ్డాడు. అతనిపైన నేనుపడ్డాను అకస్మాత్తుగా నేను కొట్టినదెబ్బ షాక్‌కు, నా బరువువలన అరనిముషం పాటు అచేతనంగా వుండి పోయాడతను.

భుజంలో దిగిన కత్తిని బయటికి లాగలేదు నేను, అది అలానే వదిలేసి కాళ్ళతో, చేతుల్తో అతన్ని వివక్షత లేకుండా ఇష్టంవచ్చినట్లు గుద్దసాగాను. అలా ఎంతసేపు అతన్ని బాధించానో నాకు గుర్తులేదు. అప్పటివరకూ అతనిమీద నాలో పెరిగిన కసి, ద్వేషం నన్ను మానవత్వం మరిచి పోయేలా చేశాయి.

అతని ముక్కులోనుండి, నోటిలోనుండి, భుజంమీద గాయంలోనుండి వస్తున్న రక్తం, అతని శరీరంలో ఆగిన కదలిక చూచి నాకు ఒళ్ళుతెలిసింది. ఒక్కక్షణం నమ్మలేనట్లు బండారీవంక తేరిపార జూశాను.

బండారీ మూలుగుతూ అలానే పడివున్నాడు. తెరచివున్న అతనికళ్ళు ఇంకా సంభ్రమంగా నావైపే చూస్తున్నయ్. జరిగిన విషయం నమ్మలేనట్లు, అలానే నా వైపు చూస్తున్నాడు. మెల్లిగా అతని భుజం మీదవున్న రైఫిల్‌ను తొలగించి చేత్తో పట్టుకొని నిలబడ్డాను. ఏమాత్రం నన్ను ఆటంకపరచలేదు.

రైఫిల్‌చేత్తో పట్టుకొని రొప్పుతూ నిలబడ్డాను.

"లేచినిలబడు బండారీ! నీ ఆటకట్టింది"— అన్నాను క్రూరంగా అతనివైపుచూస్తూ.

బండారీ మాట్లాడలేదు. అతని భుజంలో దిగిన కత్తిని బయటకు లాగాలని ప్రయత్నించాడు. రక్తం గాయంలోంచి వరదలా కారింది. మెల్లిగా లేవడానికి ప్రయత్నించాడు. బహుశా

నేను ఆ కోపంలో, కసితో అతన్ని పెద్ద దెబ్బలే కొట్టివుండాలి. రెండు చేతులమీదా లేవబోతూ చటుక్కున వెనక్కి పడిపోయాడు. బండారీ స్పృహతప్పాడు.

అతడి కాళ్ళూ, చేతులు బంధించి, జీప్‌లో వేసుకొని, మా గ్రామంవైపు బయలు దేరాను.

—: ఐపోయింది :—